Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 280 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 29 అక్టోబర్ 2023 | ఆదివారం | పేజీలు : 4

### పెరిగిన ఉల్లి ధరలు.. బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ఢిల్లీ: దేశ రాజధానిలో పెరిగిన ఉల్లి ధరలు వినియోగదారుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ఉల్లి ధరలు పెరిగాయి. ఇవాళ మార్కెట్లో కిలో ఉల్లి రూ.70 పలుకుతోంది. పెరిగిన కూరగాయల ధరలతో చుక్కలు చూస్తున్న పబ్లిక్ కు ఇది మరో షాకింగ్ న్యూస్ అనే చెప్పుకోవచ్చు. ఢిల్లీ మార్కెట్లో ప్రస్తుతం కొన్ని కూరగాయల ధరలు కిలో రూ.30 –50 పలుకుతున్నాయి. నవంబర్ మొదటి వారానికి ఉల్లి కిలో రూ.100 దాటే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఖరీఫ్ పంటలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చే డిసెంబరు వరకు ధరలు తగ్గే ఛాన్స్ లేదని ప్రభుత్వం చెబుతోంది. నవరాత్రి ఉత్సవాలు ముగియగానే ధరలు పెరగడంతో పబ్లిక్ ఆందోళన చెందుతున్నారు. "ఉల్లి దిగుబడి తక్కువగా ఉందని ఫలితంగా రేట్లు పెరుగుతున్నాయని ఓ వ్యాపారి అన్నాడు. సరఫరాలో కొరత కారణంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయని చెప్పాడు.

# ఎన్నికల వేళ.. 'రైతు బంధు' రాజకీయం!

## కాంగ్రెస్ అడ్డుకుంటోందంటున్న బీఆర్ఎస్

## అధికారంలోకి రాగానే మేమే ఇస్తామంటోన్న కాంగ్రెస్




హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కీలక స్థాయికి చేరుకున్నాయి. నామినేషన్ల ఘట్టం ప్రారంభం కాకముందే.. పార్టీల మధ్య వ్యూహ ప్రతివ్యూహాలు రాజ్యమేలుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్ ఎస్‌కు ప్రధాన ఓటు బ్యాంకుగా మారిన రైతు బంధుపై రాజకీయం మరింతగా వేడెక్కింది.


ప్రస్తుతం రైతు బంధును విడుదల చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే.. దీనిని విడుదల చేసేందుకు నిజానికి ఖజానాలో సొమ్ము సరిపోయే పరిస్థితి లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల నోటిఫికేషన్, కోడ్ వంటివాటిని చూపి.. ఈ దఫా నిధులను నిలిపివేయడం ద్వారా.. కొంత మేరకు ఉపశమనం పొందాలనే ఆలోచన అధికార పార్టీకి ఉన్నట్టు తెలుస్తోంది. అయితే.. సర్కారు ను ఈ కీలక సమయంలో ఇరుకున పెట్టేలా.. కాంగ్రెస్ వ్యూహాత్మక రాజకీయానికి తెరదీసింది. రైతు బంధు నుంచి తప్పించుకునేందుకు బీఆర్ ఎస్ ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు సంధించింది. ఇది రైతుల్లోకి బలంగా వెళ్తోంది.

కాంగ్రెస్ వాదన బలంగా మారి.. రైతులు ప్రభావితం అయితే.. బీఆర్ ఎస్‌కు కీలకమైన ఓటు బ్యాంకు ప్రతి బంధకంగా మారనుందనే అంచనాలు వస్తున్నాయి. దీంతో బీఆర్ ఎస్ కూడా.. ప్లేట్ మార్చింది. తాము రైతు బంధును ఇవ్వాలని అనుకున్నామని.. కానీ, కాంగ్రెస్ పార్టీనే దీనికి అడుగడుగునా అడ్డు పడుతోందని.. ఆ పార్టీ చెబుతోంది.

కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఉత్తరాలు రాస్తూ.. రైతు బంధును అడ్డుకుంటోందని బీఆర్ ఎస్ కీలక నాయకుడు, మంత్రి హరీష్‌రావు తాజాగా వ్యాఖ్యలుచేశారు. అయితే.. రైతు బంధు పథకం ఇప్పటిది కాదు కనుక.. ఎన్నికల వేళ ఆ పథకాన్ని అడ్డుకునేఅవకాశం లేదు. గతంలో పలు రాష్ట్రాల్లోనూ ఇదే జరిగింది. ఎప్పుడో ప్రారంభించిన పథకాలను కొనసాగించుకోవచ్చని కోర్టులు కూడా తీర్పు చెప్పాయి. సో.. కాంగ్రెస్ అడ్డు పడినా.. చేయాలని అనుకుంటే.. బీఆర్ ఎస్ సర్కారుకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. అయినప్పటికీ.. కాంగ్రెస్‌ను ఇరుకున పడేయడంతోపాటు.. ఖజానా పరిస్థితి నుంచి కూడా తప్పించుకునే వ్యూహంతో బీఆర్ ఎస్ వ్యవహరిస్తోందని అంటున్నారు పరిశీలకులు. మొత్తానికి తెలంగాణ పాలిటిక్స్‌లో ఇప్పుడు రైతు బంధం సంచలన అంశంగా మారిపోయింది.

అయితే రైతు బంధును మేము ఆపమనడం లేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులను విడుదల చేస్తామని చెబుతున్నామని కాంగ్రెస్ గట్టిగా జనాల్లోకి తీసుకెళుతోంది.

## అభ్యర్థులకు షాక్ తగులుతోందా ?



నిజామాబాద్ : ఎన్నికల తేదీ దగ్గరకొస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ ఎంఎల్‌ఏలకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని అనుకుంటున్న ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌ఏ అభ్యర్థులకు స్థానిక నేతలు షాకులిస్తున్నారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో మీటింగుల ఏర్పాటుకు ససేమిరా అంటున్నారు. దీనికి కారణం ఏమిటంటే సంక్షేమపథకాల అమలులోని అస్తవ్యస్థ విధానాలే. ఏ పథకం కూడా సంపూర్ణంగా అర్హులకు అందుతున్నది లేదు. దాంతో తమ దగ్గరకు వస్తున్న అధికారపార్టీ నేతలను జనాలు నిలదీస్తున్నారు.

జనాల నిలదీతలకు భయపడుతున్న ద్వితీయ శ్రేణినేతలు అసలు మీటింగులను ఏర్పాటు చేయాలంటేనే భయపడిపోతున్నారు. మంచిర్యాల, చేవెళ్ళ, సత్తుపల్లి, వర్ధన్నపేట, జహీరాబాద్, నిజామాబాద్ నియోజకవర్గాల్లో అయితే ఎంఎల్‌ఏలను జనాలు తమ గ్రామాల్లోకి అడుగు కూడా పెట్టనీయలేదు. కారణం ఏమిటంటే పథకాలు అర్హులకు అందకపోవటమే. పథకాలు అందటంలేదని కాళ్ళు అరిగేలా జనాలు ఐదేళ్ళు మంత్రులు, ఎంఎల్‌ఏల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఎవరు పట్టించుకోలేదు. దాంతో ఎన్నికల్లో ఓట్లకోసం తమ దగ్గరకు వస్తున్న అభ్యర్థులపై జనాలు మండిపోతున్నారు. తమకు పథకాలు అందని వైనాన్ని జనాలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. అభ్యర్థుల సమాధానాలను వినటానికి కూడా జనాలు ఇష్టపడటంలేదు. పైగా అభ్యర్థులతో మీటింగ్ ఏర్పాటుచేసిన ద్వితీయ శ్రేణి నేతలపైన కూడా మండిపోతున్నారు. 24 గంటలూ జనాల మధ్యలోనే ఉండాల్సిన స్థానిక నేతలు తమకెందుకొచ్చిన సమస్యంటు తప్పించుకుని తిరుగుతున్నారు. అభ్యర్థులు ఎంతగా ఒత్తిళ్ళు తెస్తున్నా ద్వితీయశ్రేణి నేతలు మీటింగులను మాత్రం ఏర్పాటుచేయటంలేదట. అభ్యర్థులు రెడీగా ఉన్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచులు మీటింగులు ఏర్పాటుచేయటంలేదన్న ఫిర్యాదులను కేటీయార్ దృష్టికి వెళుతున్నాయి. దాంతో మంత్రి స్వయంగా ద్వితీయ శ్రేణి నేతలతో మాట్లాడి సమావేశాలు ఏర్పాటుకు ఒత్తిడి చేయాల్సొస్తోంది. అయినా పెద్దగా ఫలితం ఉన్నట్లు అనిపించటంలేదు. సిట్టింగ్ ఎంఎల్‌ఏలు అభ్యర్థులుగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ సమస్య చాలా ఎక్కువగా ఉంది.

ఎందుకంటే పథకాల్లో లబ్దిదారుల నుండి కమీషన్లు తీసుకోవటం, అర్హులను కాదని అనర్హులకు పథకాలను వర్తింపచేసిన ఫలితంగానే ఇపుడు జనాల వ్యతిరేకతను ఎదుర్కోవాల్సొస్తోందని పార్టీవర్గాల సమాచారం. బీసీ బంధు, రైతు బంధు, రైతురుణమాఫీ ఇలా ఏ స్కీం తీసుకున్నా ఇదే తీరు. అందుకనే జనాలు ఎక్కడికక్కడ తిరగబడుతున్నారు. మరి చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.

## కేజీ టు పీజీ ఉచిత విద్య.. ఛత్తీస్‌గఢ్‌లో రాహుల్ హామీ



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బీడీ ఆకులు సేకరించే వారికి ఏడాది రూ.4 వేలు ఇస్తామని చెప్పారు. కంకేర్ జిల్లాలోని భానుప్రతాప్‌పూర్‌లో శనివారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ పాల్గొన్నారు. బస్తర్ ప్రాంతంలో గిరిజనులు అత్యధికంగా నివసించే ఈ నియోజకవర్గం సహా 20 చోట్ల నవంబర్ 7న తొలి దశల ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన స్థానాల్లో 17న రెండో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. ఈ సారి అధికారంలోకి వస్తే.. కేజీ టు పీజీ వరకు ప్రభుత్వ సంస్థల్లో విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని చెప్పారు. ఇందుకోసం ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రాజీవ్ గాంధీ ప్రోత్సాహక యోజన కింద బీడీ ఆకులు సేకరించే వారికి రూ.4వేలు అందిస్తామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌తో పాటు దేశంలో తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్త కులగణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. తనను తాను ఓబీసీగా చెప్పుకొనే మోదీజీ మాత్రం.. కులగణనకు భయపడుతున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్రంలోని భాజపా సర్కారు ఒకరిద్దరు పారిశ్రామిక వేత్తల కోసం పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ మాత్రమే రైతులు, దళితులు, కార్మికుల, ఆదివాసీల కోసం పనిచేస్తోందని చెప్పారు. తాను మాట్లాడుతుండగా ఎవరో మూర్ఛపోయారని తెలుసుకున్న రాహుల్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపివేశారు. వేదిక చివరికి నీటి సీసాతో వెళ్లి అతడి పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం తిరిగి తన ప్రసంగాన్ని కొనసాగించారు.




# జస్సులు ఊపేలేదబ్బా!

## ఎన్నికలు సమీపిస్తున్నా కానరాని జోష్

## ఆల్ పార్టీస్ ఫుల్ సైలెన్స్!!

హైదరాబాద్ : ఎన్నికలు వస్తున్నాయంటేనే రాజకీయం రగులుకుంటుంది. పోటాపోటీ యాత్రలు.. హామీలు.. విమర్శలు.. ప్రతి విమర్శలు.. ఆరోపణలు.. ఇలా రాజకీయం రణరంగంగా మారుతుంటుంది. అయితే.. రోటీన్ కు భిన్నంగా ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ వాతావరణం స్తబ్దుగా మారటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కోడ్ కూసి ఇన్ని రోజులైన తర్వాత కూడా రాజకీయంలో చురుకు లేకపోవటం ఒక ఎత్తు అయితే.. ఎందుకిలా? అన్నది ప్రశ్నగా మారింది. కోడ్ కూయటానికి ముందు అధికార బీఆర్ఎస్ తన అభ్యర్థుల్ని డిసైడ్ చేయటం.. బరిలో పాత వారే తప్పించి.. కొత్త వారు చాలా తక్కువగా ఉండటం ఒక ఎత్తు అయితే.. వారికి పోటీగా బరిలోకి దిగాల్సిన కాంగ్రెస్.. బీజేపీ అభ్యర్థుల లెక్క తేలకపోవటం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఈ రెండు పార్టీలకు చెందిన ఆశావాహులు ఇప్పటికి టికెట్లను దక్కించుకునే ప్రయత్నంలో మునిగి ఉన్నారు. ఒకసారి టికెట్ ఫైనల్ అయి.. అభ్యర్థిగా ప్రకటనలు వచ్చేస్తే.. ప్రచారం మీద ఫోకస్ చేయాలన్నది వారి ఆలోచనగా చెబుతున్నారు. టికెట్ రేసులో ఉండి.. నియోజకవర్గంలో హడావుడి చేసి.. తీరా టికెట్ రాకపోతే పరువు పోతుందన్న ఉద్దేశంతో ఎవరికి వారు కాస్తంత సంయమనాన్ని పాటిస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి తోడు అధికార పార్టీ ఆర్థిక వనరులతో పోలిస్తే.. తమ వద్ద ఉన్న వనరులు తక్కువగా ఉండటం మరో కారణంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. అధికార పార్టీ నేతలు సైతం ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తొందరపడి పంపిణీ కార్యక్రమాన్ని షురూ చేస్తే.. దాన్ని ఆపటం కష్టంగా ఉంటుందని.. ప్రత్యర్థుల లెక్క తేలిన తర్వాత ప్రచార వేగాన్ని పెంచాలన్న ఆలోచనతో ఉన్నట్లు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు.. వారికున్న పరిమితులు తెలంగాణలో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించే విషయంలో ఆలస్యం జరుగుతున్నట్లుగా చెబుతున్నారు. ఈ నెలాఖరు నాటికి పార్టీల అభ్యర్థుల జాబితాలు వచ్చేస్తాయని.. ఆ వెంటనే రాజకీయ వేడి రగులుకోవటం ఖాయమంటున్నారు.

# సంపాదకీయం

## బీజేపీ టికెట్లు ఎగరేసుకుపోతున్న మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన నేపథ్యంలో టికెట్లను ఆశిస్తున్న బీజేపీ శ్రేణుల ఆశలపై మాజీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నీళ్లు చల్లుతున్నారు. ఇన్నేండ్లుగా పార్టీ జెండా మోస్తూ ఏనాటికైనా తమకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశలు పెట్టుకున్న నాయకులకు బ్యూరోక్రాట్లు గండికొడుతున్నారు. నిన్న..మొన్న కాషాయ కండువా కప్పుకున్న మాజీ అధికారులు టికెట్‌లు ఎగరేసుకుపోతున్నారు. పార్టీ అధిష్ఠానం తమను కాదని బ్యూరోక్రాట్ల పట్ల మొగ్గు చూపడం బీజేపీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా మాజీ ఐఏఎస్/ఐపీఎస్‌లు బీజేపీలో చేరారు. తమకు మొండిచేయి చూపుతూ అధికారులను అందలమెక్కించడాన్ని బీజేపీ నాయకులు అవమానంగా భావిస్తున్నారు. వీరంతా మూకుమ్మడిగా ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను, కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులుగా ఉన్న సమయంలో వీరు ఎన్నడూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడలేదని, ఇప్పుడు ఎన్నికల ముంగిట టికెట్ల కోసం బారులు దీరుతున్నారని బీజేపీ ఎస్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు జితేంద్ర మీనా మండిపడ్డారు. ఇంతకాలం అధికారాన్ని అనుభవించి ఇప్పుడు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందడం కోసం టికెట్లు ఆశిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అధికారంలోకి తెచ్చింది బీజేపీ కార్యకర్తలు తప్ప బ్యూరోక్రాట్లు కాదని బీజేపీ రాజస్థాన్ ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. రాజస్థాన్‌లో డజనుమందికి పైగా మాజీ ఐఏఎస్‌లు టికెట్లు ఆశిస్తుండగా.. వారికి అవకాశం కల్పిస్తే పార్టీ శ్రేణులు మూకుమ్మడిగా మరో పార్టీలోకి మారడం ఖాయమని కమలనాథులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది తమ పదవీ కాలం ముగిసిన తరువాత బీజేపీలో చేరగా, కొందరు ఎన్నికల ముంగిట తమ పదవులకు రాజీనామా చేసి కాషాయ కండువా కప్పుకుంటున్నారు.

**కీలక శాఖలు వారికే..** ప్రస్తుతం కేంద్ర క్యాబినెట్‌లో పలు కీలక మంత్రి పదవులలో ఉన్నవారు మాజీ ఐఏఎస్‌లే కావడం గమనార్హం. మంత్రి పదవుల్లోనే కాకుండా పార్టీలో పదవులను కూడా వీరు ఆక్రమిస్తుండటం విశేషం. తాజాగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఐపీఎస్ అధికారికే అన్నామలై నియమితులు కావడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అంతకుముందు ఓపీ చౌదరి (ఐఏఎస్)ని ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ ప్రధానకార్యదర్శిగా, ఏకే శర్మ (ఐఏఎస్)ను ఉత్తరప్రదేశ్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. పలువురు ఐఏఎస్/ఐపీఎస్‌లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ అభ్యర్థులుగా పోటీచేశారు.

**పాటిస్తారు.. ఎదురు చెప్పరు!** కేంద్రంలో సివిల్ సర్వెంట్ల ప్రభావం నానాటికీ పెచ్చుమీరుతున్నదని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ మంత్రి విమర్శించారు. ఈ ఏడాది జులైలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఐఏఎస్ అధికారులే ప్రజెంటేషన్ ఇచ్చారని ఉదహరించారు. మా కార్యక్రమాలపై పీఎంఓ నిఘా వేస్తుంది. మేం ఏ కార్యక్రమాల్లో పాల్గొనాలో పీఎంఓలోని అధికారులే నిర్ణయిస్తారు. బ్యూరోక్రాట్లకు ఆదేశాలను అమలు చేయడమే తెలుసు, వారికి ఎదురుచెప్పడం రాదు.. అందుకే మోదీ వారినే ఎక్కువగా నమ్ముతారు. ప్రజలకు హాని చేసే నిర్ణయాలను అమలు చేయడానికి మేమైతే వెనుకడుగు వేస్తాం.. అందుకే ఆయన మమ్మల్ని విశ్వసించరు' అంటూ కుండబద్దలు కొట్టారు.




# మల్కాజిగిరిపై 'జనసేన' నజర్! బరిలో కీలక నేత

## – పొత్తు చర్చల నేపథ్యంలో జోరుగా ప్రచారం

హైదరాబాద్ : ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేయనున్న నేపథ్యంలో గ్రేటర్‌లో కొన్ని స్థానాల్లో బరిలో నిలిచేందుకు పవన్‌సేన సిద్ధమవుతోంది. పొత్తుపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రానున్న నేపథ్యంలో జనసేన మల్కాజిగిరి అసెంబ్లీ స్థానంపై కన్నేసింది. పొత్తులో భాగంగా ఆ సీటును జనసేనకు కేటాంచనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఓ కీలక నేతను జనసేనాని పోటీలో ఉంచుతారని చెబుతున్నారు. అయితే, బీజేపీ టికెట్ కోసం నలుగురు నేతలు జోరుగా పైరవీలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, ప్రముఖ బిల్డర్, జీకే కన్‌స్ట్రక్షన్స్ అధినేత జీకే హన్మంతరావుతోపాటు మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ టికెట్ రేసులో ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు ఈసారి పోటీకి అనాసక్తిని ప్రదర్శించడంతో ఈ నలుగురు హస్తిన స్థాయిలో జోరుగా పైరవీ చేస్తున్నారు.

ప్రధానంగా ఆకుల రాజేందర్, భానుప్రకాశ్‌ల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆకుల రాజేందర్ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.


# సిరిసిల్లాలో కాంగ్రెస్ కి బాహుబలి...!



సిరిసిల్ల : తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ ఎత్తులు వేరే లెవెల్ లో ఉంటున్నాయి. గతంలో చేసిన తప్పులను ఏ మాత్రం చేయడం లేదు. వ్యూహాలను సైతం పదును పెట్టుకుంటోంది. ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ జాగ్రత్తగా ముందుకు అడుగులు వేస్తోంది. ఇక కాంగ్రెస్ బీయారెస్ లోని అగ్ర నాయక త్రయం మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది అని అంటున్నారు. బీయారెస్ లో ఆ ముగ్గురూ టాప్ లీడర్స్ అంటే ముందుగా కేసీయార్ కనిపిస్తారు. అలాగే కేటీయార్, హరీష్ రావు తరువాత వరసలో వస్తారు. ఈసారి ఈ ముగ్గురి సీట్లలో వారిని ఊరికే వదిలేయకూడదని గట్టి అభ్యర్ధులను పోటీకి పెట్టడం ద్వారా పద్మవ్యూహంలో బిగించాలని కాంగ్రెస్ చూస్తోంది అని అంటున్నారు. అందులో ముందుగా చూస్తే మంత్రి కేటీయార్ కనిపిస్తారు. ఆయన కేసీయార్ రాజకీయ వారసుడు మాత్రమే కాదు మూడవసారి బీయారెస్ తెలంగాణా ఎన్నికల్లో గెలిస్తే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్న వారు. దాంతో కాంగ్రెస్ కేటీయార్ ని గట్టిగా టార్గెట్ చేస్తోంది అని అంటున్నారు. ఆయన సొంత నియోజకవర్గం సిరిసిల్ల మీదనే కాంగ్రెస్ కన్నేసింది అని అంటున్నారు. సిరిసిల్ల విషయానికి వస్తే 2009లో కేటీయార్ మొదటి సారి ఇక్కడ నుంచి గెలిచారు. అలా ఒక ఉప ఎన్నికతో కలిపి ఇప్పటికి నాలుగు సార్లు ఆయన ఎమ్మెల్యేగా ఉంటూ వస్తున్నారు. తాజా ఎన్నికలతో ఆయన అయిదో సారి పోటీ చేస్తున్నారు. కేటీయార్కి 2014 ఎన్నికల్లో 53 వేల దాకా మెజారిటీ వస్తే 2018 నాటికి అది కాస్తా 89 వేల పై దాటింది. ఈసారి కూడా గెలిచి తీరుతాను అని ధీమాతో కేటీయార్ ఉన్నారు. ఇటీవల కేసీయార్ సిరిసిల్లలో మీటింగ్ పెట్టి కేటీయార్ ని దీవించాలని కోరారు. అయితే బీయారెస్ మీద యాంటీ ఇంకెంబెన్సీ ఒక స్థాయిలో ఉంది. దాంతో రాజకీయంగా ఏమైనా జరగవచ్చు అన్న అంచనాలు ఉన్నాయి. దాంతో పాటు గతసారి సాధించిన భారీ మెజారిటీ కేటీయార్ కి ఈసారి రాకపోవచ్చు అని కూడా అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బలమైన అభ్యర్థినే ఆయన మీద పోటీకి కాంగ్రెస్ రెడీ చేసి పెట్టింది అని అంటున్నారు. 2018 ఎన్నికల్లో కేటీయార్ మీద కేకే మహేందర్ రెడ్డి పోటీ చేశారు. ఈసారి బిగ్ షాట్ గా ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డిని పోటీకి దించాలని కాంగ్రెస్ చూస్తోంది అని అంటున్నారు. ఆయనే కాంగ్రెస్ కురు వృద్ధుడు టి జీవన్ రెడ్డి అని అంటున్నారు. టీ జీవన్ రెడ్డి 1983లో టీడీపీ ద్వారా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన ఉమ్మడి కరీం నగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఉమ్మడి ఏపీలో మూడు సార్లు మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఉంటున్నారు. మంచి మాటకారి, వ్యూహకర్త, జనంలో బలం ఉన్న నేత అయిన జీవన్ రెడ్డిని కేటీయార్ మీద పోటీకి దింపాలన్నది కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ అని అంటున్నారు. జీవన్ రెడ్డి అయితే కేటీయార్ గెలుపుని అడ్డుకోగలరని కాంగ్రెస్ భావిస్తోంది. కేటీయార్ తండ్రి కేసీయార్ సమకాలీనుడు అయిన జీవన్ రెడ్డి ప్రత్యర్ధి అయితే కేటీయార్ కూడా సిరిసిల్ల మీదనే పూర్తి స్థాయిలో ఫోకస్ చేయాల్సి ఉంటుంది అని అంటున్నారు. కాంగ్రెస్ కి కూడా అదే కావాల్సింది అని అంటున్నారు. కేటీయార్ తన సీటు మీద పూర్తి హామీతో ఉంటే తెలంగాణా మొత్తం ప్రచారం చేయడానికి వీలు అవుతుంది. అలా కాకుండా అక్కడే కుంపటి పెడితే కచ్చితంగా ఎక్కువ టైం సిరిసిల్లాలోనే గడపాలి. ఇక కేటీయార్ని ఓడించడం అన్నది ఫస్ట్ టార్గెట్, లేకపోతే మెజారిటీని దారుణంగా తగ్గించడం మరో టార్గెట్. ఇలా ద్విముఖ్య వ్యూహంతో జీవన్ రెడ్డి వంటి బాహుబలిని కాంగ్రెస్ బరిలోకి దించబోతోంది అని అంటున్నారు. ఇక ఎటూ ఎమ్మెల్సీగా జీవన్ రెడ్డి ఉన్నారు. ఆయన ఓడిపోయినా నష్టం లేకుండా కాంగ్రెస్ గెలిచిన తరువాత మంత్రి పదవిని కూడా హామీ ఇస్తున్నారు అని అంటున్నారు. అలా జీవన్ రెడ్డిని పోటీలోకి దించడం ద్వారా కేటీయార్ కి భారీ షాక్ ఇవ్వాలని కాంగ్రెస్ వ్యూహ రచన చేస్తోంది. మొత్తానికి అదే జరిగితే సిరిసిల్లాలో కేటీయార్ రాజకీయ సిరి ఎంతవరకు నిలబడుతుందో చూడాలని అంటున్నారు.

# తెలంగాణలో తగ్గుతోన్న ఉష్ణోగ్రతలు..

హైదరాబాద్ : తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతోన్నాయి. వారం క్రితం వరకు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదు కాగా.. తాజాగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ముఖ్యంగా రాత్రి పూట ఉష్ణోగ్రత తగ్గుతోంది. క్రమంగా చలి పెరుగుతోంది. నైరుతి రుతుపవనాలు తిరోగమనంతో వాతావరణం మారుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణలో మధ్యాహ్నం ఎండగా ఉండగా.. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. అటు బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఈశాన్య దిశ నుంచి తెలంగాణ వైపు చల్ల గాలులు వీస్తున్నాయి. దీంతోనే ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. మరోపక్క పగటి పూట ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతవరణ శాఖ చెబుతోంది. ఈశాన్య దిశల నుంచి వస్తున్న గాలుల ప్రభావంతో చలి పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు వివరిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కనిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలికాలం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈసారి కూడా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. రెండు రోజులుగా వాతావరణంలో



వేగంగా మార్పులు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ వివరించింది. ప్రధానంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతల్లో భారీగా తగ్గుదల కనిపిస్తోంది. మెదక్, వరంగల్ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదు అవుతున్నాయి. ఆదిలాబాద్, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2 డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదు అయ్యాయి. ఉత్తర ప్రాంతంలో మాత్రం సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 35.8 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 15 డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి.

# పార్టీలో అవమానాలు జరిగాయి.. ఎన్నికల్లో పోటీ చేయను: బాబూమోహన్




హైదరాబాద్: ఈసారి ఎన్నికల్లో పోటీ చేయొద్దని నిర్ణయించుకున్నట్లు భాజపా నేత బాబూమోహన్ తెలిపారు. ఎన్నికలు, పార్టీ ప్రచారాలకు దూరంగా ఉంటానని వెల్లడించారు. అధిష్ఠానం నిర్ణయం మేరకు పార్టీకి కూడా రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాబూమోహన్ మాట్లాడారు. "అసెంబ్లీ ఎన్నికల్లో నా కుమారుడికి టికెట్ ఇస్తున్నట్లు ప్రచారం చేసి.. మా మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించారు. అర్హులకే టికెట్ ఇవ్వాలని భాజపా పెద్దలను కోరుతున్నా. పార్టీలో నాకు చాలా అవమానాలు జరిగాయి. ఆత్మాభిమానం దెబ్బతినడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. భాజపా జాబితాలో నా పేరు లేకపోవడంతో తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయి. నేను ఫోన్ చేస్తే.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లిఫ్ట్ చేయరు. కావాలనే నన్ను పార్టీకి దూరం పెట్టారు" అని బాబూమోహన్ తెలిపారు.

# అవగాహనతోనే జలసంరక్షణ

ధర్మపురి : జిల్లాలోని ఐదు పురపాలికల్లో నల్లాల ద్వారా అందించే నీరు వృథా కావడంపై పుర అధికారులు, కౌన్సిలర్లు దృష్టి సారించారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నీటిని వృథా కానివ్వకుండా సద్వినియోగపరచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజలను చైతన్యపరుస్తూ..ప్రతి గ్రామానికి, ఇంటింటికీ ఎంత దూరం నుంచి నీరు వస్తోంది. ప్రతి లీటరు నీటిని సేకరించి శుద్ధి చేయడానికి ఎంత ప్రజాధనం వ్యయం అవుతోంది. నిత్యం ఏ మేరకు జలాలు వృథా అవుతున్నాయి. తదితర విషయాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి నీటిబొట్టును సద్వినియోగపరుచుకునేలా స్థానికులను చైతన్యపరుస్తున్నారు పుర అధికారులు. అంతే కాకుండా నీరు వృథా అయ్యే ప్రాంతాలను గుర్తించి అడ్డుకట్ట వేస్తున్నారు. పలుచోట్ల నూతనంగా పైపులైను పనులను చేపడుతున్నారు. అత్యవసర పద్దు కింద నిధులు విడుదల చేస్తున్నారు.ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఓ వైపు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులతో చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో పైపులైను వేసిన కొన్నాళ్లకే మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. వీటిని అధిగమించడానికి అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు వార్డులు.. ఐదువందల ఇళ్లు

జిల్లాలోని ఐదు పురపాలికలున్నాయి. ప్రతి పురపాలికలో తొలుత ఎంపిక చేసిన ఐదు వార్డుల్లో ఐదు వందల ఇళ్ల వద్ద పుర అధ్యక్షులు,



కౌన్సిలర్లు, అధికారులు, ఆర్పీలు, తాగునీటి సిబ్బంది కలిసి పర్యటిస్తున్నారు. నేరుగా నీటి సరఫరా జరిగే సమయంలో ఇళ్లకు వెళ్లి పరిశీలించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నీటి వృథాపై అవగాహన – సీహెచ్ రమేష్, పుర కౌన్సిలర్, ధర్మపురి నీటి వృథాపై ప్రజలకు ఎంపిక చేసిన వార్డుల్లో అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. వార్డుల్లో ప్రజలకు నీటి లీకేజీపై అవగాహన కల్పించి తాగునీటి పథకం పనులకు నిధులు మంజూరు చేస్తున్నాం. అత్యవసర నిధుల పద్దు కింద రూ.35 లక్షల నిధులు కేటాయించాం. ధర్మపురిలో ఇందిరమ్మ కాలనీ, తెనుగువాడ కాలనీలో కొత్త పైపులైను నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాం.

# జిల్లాకు రాయితీ నిధులు రూ.39.89 కోట్లు

కరీంనగర్ : పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందితే ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తోందనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పారిశ్రామిక విధానంలో అనేక సంస్కరణలు చేసింది. టీఎస్ఐపాస్ ద్వారా ప్రభుత్వం సత్వర అనుమతులు ఇస్తోంది. పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే వారికి పలు రాయితీలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా టీ–ప్రైడ్, టీ–ఐడియా పథకాల ద్వారా ప్రోత్సాహకాలు అందజేస్తోంది. రాయితీ నిధులకు సంబంధించి పారిశ్రామికవేత్తలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న తరుణంలో అందుకు సంబంధించిన నిధులను సర్కారు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

1,829 యూనిట్లు

కరీంనగర్ జిల్లాలో టీ–ఐడియా, టీ–ప్రైడ్ కింద అన్ని విభాగాల్లో 1,829 యూనిట్లకు రూ.244.05 కోట్లు రాయితీ కింద రావాల్సి ఉంది. ఇందులో పెట్టుబడి రాయితీ కింద 819 యూనిట్లకు రూ.174.53 కోట్లు, పావలా వడ్డీ కింద 766 యూనిట్లకు రూ.34.24 కోట్లు, విద్యుత్తు రాయితీ విభాగంలో 244 యూనిట్లకు రూ.35.28 కోట్లు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా గ్రానైట్ పరిశ్రమలకు రూ.వంద కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఎస్సీ, ఎస్టీలకు మేలు

పారిశ్రామికవేత్తలు రాయితీ నిధుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సర్కారు నిధులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసింది.



అయితే పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో కొంతవరకు పరిశ్రమల వర్గాల్లో నిరాశ కన్పిస్తోంది. కేవలం ఎస్సీ విభాగంలో 15.58 కోట్లు, ఎస్టీ విభాగంలో రూ.2.61 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. జనరల్ విభాగంలో రూ.21.7 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా.. అవి కూడా సిక్ ఇండస్ట్రీస్‌కు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2020 నవంబర్ వరకు ఉన్న రాయితీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. 2015 నుంచి ఎదురు చూస్తున్న రాయితీ నిధులు రాలేదని.. కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని పరిశ్రమలకు రాయితీ నిధులు వచ్చాయని పరిశ్రమల యజమానులు తెలిపారు. ఏళ్లుగా రాయితీ నిధుల కోసం ఎదురు చూస్తున్నామని, మా తర్వాత పరిశ్రమలు స్థాపించిన వారికి రాయితీ నిధులు వచ్చినట్లు తెలిసిందని, పైరవీలు జరిగినట్లు అనుమానంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలిఎనిమిదేళ్లుగా పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలు రావడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి, విద్యుత్తు, పావలా వడ్డీకి సంబంధించి రాయితీ నిధులను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలి. పరిశ్రమలు నడపడా నికి తెచ్చిన రుణాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం సహృదయంతో అర్థం చేసుకొని నిధులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయాలి. ఇప్పటికే 30 పరిశ్రమల వరకు మూతపడ్డాయి.జిల్లా అశోక్‌కుమార్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ అసోసియేషన్ కోశాధికారి


# పదిలో బోగస్ విద్యార్థులకు కళ్లెం

పెద్దపల్లి : పదో తరగతిలో విద్యార్థుల బోగస్ హాజరుకు అడ్డుకట్ట వేసేందుకు విద్యాశాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్-యూడైస్)లో నమోదైతేనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేసింది.

ఇప్పటివరకు పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజును ప్రవేశ వివరాల(అడ్మిషన్ రిజిస్టరు) ఆధారంగా చెల్లించేవారు. దీంతో కొన్ని చోట్ల అనుమతి లేని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదివినట్లు చూపుతూ పరీక్ష ఫీజు చెల్లిస్తున్నారు. దీంతో కొంత ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇకపై పరీక్ష రాసే ప్రతి విద్యార్థి వివరాలు యూడైస్‌లో నమోదై ఉంటేనే ఫీజు చెల్లించేందుకు అనుమతి ఉంటుంది.

పాత విధానంలో నమోదు గందరగోళం

జిల్లాలో 103 ప్రభుత్వ ఉన్నత, 176 ప్రైవేటు పాఠశాలల్లో 9 వేల మందికి పైగా పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల సమగ్ర సమాచార సేకరణలో భాగంగా యూడైస్‌ను అమలు చేస్తున్నారు. విద్యాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నిధుల మంజూరుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్నే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. అయితే పర్యవేక్షణ లోపంతో యూడైస్‌లో విద్యార్థుల ఆధార్, ఇతర వివరాల నమోదు గందరగోళంగా మారింది. ఇప్పటివరకు పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు మ్యానువల్‌గా నామినల్ రోల్ రూపొందించి విద్యాశాఖకు నివేదించేవారు. ఈ పద్ధతిలో ప్రైవేటు పాఠశాలల్లోనూ బోగస్ విద్యార్థులున్నట్లు గుర్తించారు.



తప్పుల సవరణలో నిమగ్నం

పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు సందర్భంగా విద్యార్థుల యూడైస్ వివరాల్లో తప్పులు సవరించే పనిలో విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. కొందరు పిల్లల ఆధార్, అడ్మిషన్ రిజిస్టర్‌లో పేరు, ఇతర వివరాల్లో తేడాలున్నాయి. అయితే చిన్న చిన్న పొరపాట్ల సవరణకు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. కొన్నాళ్లుగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల ఫీజు చెల్లించే సమయంలో పేర్లను తొలగించి ఆన్‌లైన్‌లో డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం

బోగస్ విద్యార్థుల ఏరివేతకు కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇకపై ప్రతి విద్యార్థి సమగ్ర సమాచారం యూడైస్‌లో నిక్షిప్తమైతేనే వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతిస్తారు. అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, ఆధార్, చిరునామా, గతంలో చదివిన పాఠశాలల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన వివరాలతోనే నామినల్ రోల్ తీసుకుంటారు. దీంతో తప్పులకు ఆస్కారం ఉండదు. ఇప్పటివరకు కొంతమంది దీర్ఘకాలికంగా పాఠశాలకు హాజరు కాకున్నా రిజిస్టరులో కొనసాగుతున్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థుల వివరాలకు ఆధార్ అనుసంధానం చేయనున్నారు. దీంతో పదో తరగతి మెమో, టీసీలు కూడా ఆన్‌లైన్‌లో జారీ చేసే అవకాశం ఉంది.

# అనుసంధానంపైనే అందరి దృష్టి

జగిత్యాల : ఎన్నికల వేళ సాగుపనులకు ఉపాధిహామీ పనులను అనుసంధానించాలనే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. వ్యవసాయానికి ఉపాధిహామీ పనులను అనుసంధానించాలంటూ ఇటీవల రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని మరోసారి కోరగా యాసంగివేళ అమలుతో లబ్ధి కలగనుంది. ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో ఈ యాసంగిలో గరిష్ఠ విస్తీర్ణంలో పంటలు సాగులోకి రానుండగా కూలీల కొరత ప్రధాన అవాంతరంగా నిలవనుంది.

సాగు పనులకు వచ్చే కూలీల సంఖ్య ఏటికేడు తగ్గుతుండగా ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవటంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులకు ఉపాధిహామీ పనులను పూర్తిస్థాయిలో అనుసంధానించాలని నీతిఆయోగ్ కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేయగా గతంలోనే రాష్ట్ర



శాసనసభలోనూ ఈ మేరకు తీర్మాణించారు. ఈజీఎస్‌ద్వారా చేపట్టే పొలంపనుల్లో 75 శాతం కూలీఛార్జీని రైతులు భరించేలా, 25 శాతం ప్రభుత్వం చెల్లించేలా వ్యవసాయ పనులను చేపట్టాలని, రాష్ట్రం తనవంతుగా పథకాన్ని అమలు చేయవచ్చని పేర్కొన్నా ఇప్పటికీ అమలుగాక రైతులకు ఇక్కట్లు పెరుగుతున్నాయి. వ్యవసాయ పనులకు ఇటీవల కొన్నిరకాల యంత్రాలు వస్తున్నా చాలా పనులను కూలీలతోనే చేయించాల్సి ఉంటుంది. కూలీల కొరత ఉన్నందున చాలా గ్రామాల్లో వ్యవసాయ పనులు సాగే రోజుల్లో ఉపాధిహామీ పనులను నిలిపివేయాల్సి వస్తోంది. ప్రస్తుతం వానాకాలం పంటల నూర్పిడులు, పత్తితీత, పసుపు తవ్వకం, మక్కలు, పొద్దుతిరుగుడు తదితర గింజలు నాటడం, యాసంగి వరినాట్లు తదితర పనులకు కొరత ఎదురవుతోంది. యాసంగిలో పండించే ఆరుతడి పంటల్లో కలుపుతీత తదితర పనులకు కూలీలు తప్పనిసరిగా అవసరముంటుంది. ఆయిల్‌పామ్ మొక్కల గుంతలు తీయటం, పందిరి కూరగాయల సాగు, షెడ్లనిర్మాణం, బావుల పూడికతీత, ఫీడర్‌ఛానళ్లు, నీటినిల్వ కందకాల తవ్వకం, వర్మికంపోస్టు గుంతల తవ్వకం, ఇంకుడు గుంతలు, పంటకుంటల నిర్మాణం తదితరాలను గతంలో చేపట్టినా సాగుపనులను అనుసంధానించటాన్ని మాత్రం విస్మరించారు. కూలీల కొరత నివారణ, ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది కాబట్టి తాము స్వతహాగా చేపట్టే పలురకాల పొలంపనులను ఈజీఎస్‌లో చేర్చాలని అన్నదాతలు అభిలషిస్తున్నారు.

# టీయూఎఫ్ఐడీసీ నిధులతో పట్టణాల అభివృద్ధి



కోరుట్ల : జిల్లాలో పురపాలికల సుందరీకరణకు టీయూఎఫ్ఐడీసీ కింద నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రభుత్వం 2018లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు రూ.50 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించింది. ఈ నిధులతో బల్దియాల్లో చేపట్టే అభివృద్ధి పనులను 2019 జులైలో ప్రారంభించారు. ఫేజ్-1 కింద రూ.25 కోట్లు, ఫేజ్-2 కింద రూ.25 కోట్ల చొప్పున మున్సిపల్, ఆర్అండ్‌బీ పనులు చేపట్టేలా నిర్ణయించారు. అభివృద్ధి పనులు ప్రారంభించి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. అభివృద్ధి పనులు సజావుగా చేపట్టక రోడ్లు, మురుగు కాలువలు, ఇతర నిర్మాణాలకు పాతకట్టడాలు అడ్డుగా వస్తుండడంతో వాటిని తొలగించకుండా రాజకీయ ఒత్తిళ్లతోనే పనులు పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. ముందుగా గుర్తించిన పనులు కాకుండా వేరే పనులు చేపట్టాలని బల్దియా పాలకులు మార్చడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు ప్రారంభించకుండా వదిలేయడంతో వాటికి రీటెండర్లు నిర్వహించడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. కొన్ని అభివృద్ధి పనులకు సరైన స్థలాలను గుర్తించక ఇష్టారీతిన పనులు చేపట్టడంతో వాటిని మధ్యలోనే వదిలేశారు.

కొనసాగుతున్న పనులు..కోరుట్ల పట్టణంలో ఫేజ్-1 కింద రూ.25 కోట్లతో మొత్తం 16 పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. కొత్తబస్టాండ్ నుంచి గడి బురుజు వరకు రూ.80 కోట్లతో తారురోడ్డు నిర్మించాలని నిర్ణయించగా పనులను రివైజ్ చేయడంటీయూఎఫ్ఐడీసీ నిధులతో పట్టణాల అభివృద్ధి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి బల్దియాలకు రూ.50 కోట్ల చొప్పున కేటాయింపుతో టెండర్ దశలోనే నిలిచిపోయింది. పట్టణంలోని ప్రధాన రహదారి జీఎస్ గార్డెన్ నుంచి గౌతమ్ మాడల్ స్కూల్ వరకు రూ.8.72 కోట్లతో రూ.4.5 కిలో మీటర్ల పొడవునా రహదారి విస్తరణ, డివైడర్లు, గార్డెనింగ్, హైమాస్టు లైట్లు, ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించాలని 4 ఏళ్ల కిందట పనులను ప్రారంభించారు. పలుచోట్ల రోడ్డుకిరువైపులా మురుగు కాలువ, పాదచారుల నడకమార్గం నిర్మించేందుకు భవనాలు అడ్డురావడంతో వాటిని తొలగించకుండా పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో మురుగునీరు రోడ్లపైనే నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తుంది. పాత మున్సిపల్ నుంచి బొల్లికుంట వరకు కిలో మీటరు పొడవున రూ.1.20 కోట్లతో చేపట్టిన సీసీరోడ్డు పనులు కొనసాగుతున్నాయి. నందిచౌక్, బస్టాండ్ సర్కిల్, ఐబీగెస్ట్ వద్ద రూ.కోటితో జంక్షన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించగా పనులు రివైజ్ కోసం పంపించారు. ఫుల్‌వాగులో బతుకమ్మఘాట్ ఏర్పాటు కోసం రూ.35 కోట్లు కేటాయించగా పనులు ప్రారంభించలేదు. 30 వార్డుల్లో రూ.4.50 కోట్లతో సిమెంట్ రోడ్డు, ఎల్ఈడీ లైట్లు నిర్మించాలని నిర్ణయించగా పలుచోట్ల చేపట్టకుండా వదిలేశారు. ఫేజ్-2 కింద రూ.25 కోట్లతో 9 రకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. పట్టణంలోని 30 వార్డుల్లో సిమెంట్‌రోడ్డు, మురుగు కాలువలు, ఎల్ఈడీ లైట్ల అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు కేవలం 47 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. రూ.60 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టగా చివరి దశకు చేరుకుంది. రూ.90 లక్షలతో డంపింగ్‌యార్డు అభివృద్ధి చేపట్టగా సీసీరోడ్డు పూర్తికాగా, కాంపౌండ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ఫుల్‌వాగులో రూ.40 లక్షలతో బాబూజగ్జీవన్‌రామ్ పార్క్ నిర్మాణం చేపట్టగా పనులు జరుగుతుండగానే వరదల్లో కొట్టుకుపోయింది. దీంతో అలాగే వదిలేశారు.జగిత్యాల పట్టణంలో ఫేజ్-1 కింద రూ.25 కోట్లతో 18 పనులను చేపట్టాలని నిర్ణయింగా ఇందులో 12 పనులను పూర్తి చేశారు. రూ.2.35 కోట్లతో చేపడుతున్న మూడు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. రూ.2.40 కోట్లతో 3 పనులు చేపట్టాల్సి ఉండగా ఇంకా ప్రారంభించకుండా వదిలేశారు. ఫేజ్-2 కింద రూ.25 కోట్లతో 24 పనులు చేపట్టాలని గుర్తించారు. 19 పనులను పూర్తి చేశారు. రూ.10.84 కోట్లతో చేపట్టాల్సిన పనులు ఇంకా కొనసాగుతున్నాయి. రూ.2.30 కోట్లతో చేపట్టాల్సిన 3 పనులను ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

మెట్‌పల్లి పట్టణంలో ఫేజ్-1 కింద రూ.25 కోట్లతో 13 రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో రూ.1.10 కోట్లతో ఎన్‌హెచ్-63 నుంచి వట్టివాగు వంతెన వరకు 3.2 కిలో మీటర్ల పొడవున సెంట్రల్ లైటింగ్, మురుగు కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 65 శాతం పనులను చేపట్టారు. రూ.1.50 కోట్లతో వెల్లుల్లరోడ్, పోలీస్‌స్టేషన్‌రోడ్ నిర్మించాల్సి ఉండగా పనులను ప్రారంభించి వదిలేశారు. మురుగు కాలువలు నిర్మించాల్సి ఉండగా 75 శాతం పనులు చేపట్టారు. రూ.50 లక్షలతో చేపట్టిన బతుకమ్మఘాట్, పార్క్ అభివృద్ధి, ఫుట్‌పాత్ పనులును మధ్యలోనే వదిలేశారు. రూ.5 కోట్లతో రహదారి, మురుగు కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కేవలం 35 శాతం మేర పనులను చేపట్టారు. రూ.60 లక్షలతో గ్రంథాలయ భవనం ప్రారంభించగా 35 శాతం పనులు పూర్తిచేసి వదిలేశారు. రూ.1.50 కోట్లతో వెల్లుల్ల రోడ్‌లో సెంట్రల్ లైటింగ్, తారురోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా పనులు నిర్మాణంలోనే ఉన్నాయి. ఫేజ్-2 కింద రూ.25 కోట్లతో 11 పనులు చేపట్టాలని గుర్తించారు. ఇందులో రూ.2.80 కోట్లతో పెద్దచెరువు, ఫ్లిటర్‌బెడ్ ప్రహరీ, ఇతర పనులు చేపట్టాల్సి ఉండగా సగం వరకు పనులు చేపట్టి వదిలేశారు. రూ.60 లక్షలతో కుఫ్‌సింగ్ కుంటను ఉద్యానవనంగా అభివృద్ధి చేయాల్సి ఉండగా పనులను ప్రారంభించి 25 శాతం మేర పనులు చేపట్టి వదిలేశారు. రూ.60 లక్షలతో షాదీఖానా నిర్మించాల్సి ఉండగా 40 శాతం మేర పనులు చేపట్టారు.

# చెత్త నిర్వహణ... తీరని సమస్య

గోదావరిఖని : పట్టణాలు, నగరాలను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా రామగుండంలో దానికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంతో రామగుండంలో చెత్త నిర్వహణ అటకెక్కింది. చెత్త నిర్వహణను మెరుగుపరుస్తామంటూ సుమారు రూ.6 కోట్లు వెచ్చించి అత్యాధునిక వాహనాలను కొనుగోలు చేసిన బల్దియా సగం యంత్రాలను ఉపయోగంలోకి తేకపోగా శిథిలమవుతున్నాయి. ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, తడి చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారీని నగరపాలిక విస్మరించింది. పొడి చెత్తను గుత్తేదారు ద్వారా హైదరాబాద్‌లోని చెత్త నిర్వహణ కేంద్రానికి తరలిస్తున్నారు. చెత్తను తరలించేందుకు 50 ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు ఉన్నప్పటికీ ఆశించిన మేరకు పురోగతి లేదు. పర్యవేక్షణకు ముగ్గురు పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సుమారు 12 మంది సహాయ పర్యవేక్షకులు, వారికి సహాయకులుగా మరో 12 మంది ఉన్నప్పటికీ ప్రయోజనం ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటునకు ప్రభుత్వం వేలాది ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను అప్పగించగా రామగుండం నగరపాలికకు డంపింగ్ యార్డునకు నేటికీ స్థలం లేదు. అనేక మార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావడం లేదు. నగరంలోని చెత్తనంతా గోదావరి ఒడ్డున పడేస్తుండటంతో సమ్మక్క జాతర స్థలంతో పాటు గోదావరి పరీవాహక ప్రాంతం కలుషితమవుతోంది.

పరిష్కారం కాని ప్రధాన సమస్య

చిన్నచిన్న గ్రామాల్లోనూ డంపింగ్ యార్డునకు స్థలం, చెత్త నిర్వహణ కేంద్రాలుండగా 93.87 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలోఉన్న రామగుండంలో చెత్త పడేసేందుకు ప్రత్యేక స్థలమే లేదు. గత కొన్ని దశాబ్దాలుగా పెద్దంపేట సమీపంలోని సింగరేణి స్థలాన్ని నగరపాలిక డంపింగ్ యార్డుగా ఉపయోగించే వారు. సింగరేణి ఉపరితల గని విస్తరణతో సమస్య మళ్లీ తలెత్తింది. రామగుండం సమీపంలో ప్రభుత్వ స్థలంలో డంపింగ్ యార్డు కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపట్టినప్పటికీ స్థానికులు అడ్డుకోవడంతో అందులో పట్టణ ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నగరంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్త పడేసేవారు. ఆయా ప్రాంతాల వారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో నివాసాలకు దూరంగా ఉన్న గోదావరినది ఒడ్డున సమ్మక్క, సారలమ్మ జాతర స్థలంలో నగరంలోని చెత్తను పడేస్తున్నారు. దీంతో నదీజలాలు కలుషితం కావడంతో పాటు జాతర స్థలం దుర్గంధభరితంగా మారుతోంది. మూతపడ్డ సింగరేణి మేడిపల్లి ఉపరితల గనికి సంబంధించిన క్వారీని డంపింగ్ యార్డుగా అప్పగించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం జరిగినప్పటికీ అధికారికంగా స్థలాన్ని అప్పగిస్తే చెత్త తరలింపు వాహనాలు క్వారీలోకి దిగేలా ప్రత్యేకంగా ర్యాంపులను ఏర్పాటు చేయాల్సి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక



పరిశ్రమల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించి డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వృథాగా యంత్రాలు...

చెత్త నిర్వహణ మెరుగునకు కొనుగోలు చేసిన అత్యాధునిక వాహనాలను వాడుకలోకి తేకపోవడంతో అవి శిథిలమవుతున్నాయి. రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన హుక్ లోడింగ్ వాహనాన్ని గౌతమినగర్‌లోని డంపింగ్ యార్డులో, సుమారు రూ.65 లక్షలతో కొనుగోలు చేసిన రోడ్లు ఊడ్చే వాహనం, మరో 25 లక్షలతో కొనుగోలు చేసిన జెట్టింగ్ మిషన్‌తో పాటు ఇతర వాహనాలను నగరపాలక కార్యాలయం వెనకాల వదిలేశారు. చెత్త నిర్వహణ కోసం ఎన్టీఆర్ నగర్, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో సుమారు ఏడేళ్ల క్రితం ప్రత్యేకంగా నిర్మించిన షెడ్లను అలాగే వదిలేశారు. చెత్త తరలింపులో కీలకమైన యంత్రాల కోసం గౌతమినగర్, మల్కాపూర్‌లో ప్రత్యేకంగా షెడ్లను నిర్మించి అందులో యంత్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వినియోగించడం లేదు. వాహనాల నిర్వహణపై ఇటీవల ఓ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా పారిశుద్ధ్య నిర్వహణలో కీలకమైన అధికారులు సహకరించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

అటకెక్కిన సేంద్రియ ఎరువు తయారీ

ప్రయోగాత్మకంగా చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయడంలో ఒకప్పుడు దేశంలోనే అగ్రగామిగాఉన్న రామగుండం నేడు చతికిల పడింది. గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రం కేవలం పొడి చెత్త తరలింపునకే ఉపయోగపడుతోంది. ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరిచి చెత్త తరలింపు వాహనాలకు ఇవ్వాలంటూ ఇంటింటా రెండు డబ్బాలను పంపిణీ చేశారు. కొంతకాలం ప్రజలు అదే పద్ధతిని పాటించినప్పటికీ చెత్త తరలింపు వాహనాల్లో అంతా కలిపి తీసుకెళ్తున్నారు. దీంతో ప్రజలు సైతం తడి, పొడిని విడదీయడం లేదు. చెత్త తరలించే వాహనాలపై పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు చెత్తలో వచ్చే ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు, ప్లాస్టిక్ పరికరాలు, బాటిళ్లను వేరు చేసి గౌతమినగర్‌లో చెత్త నిర్వహణ కేంద్రంలో విక్రయించుకోవడం మినహా నగరపాలిక తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు శూన్యం.

# వానర బెడద.. ఇంతింత కాదయా!

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలో కోతుల బెడద తీవ్రమైంది. తరచూ ఇళ్లలోకి చొరబడి వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయి. ప్రధానంగా వంటింట్లోకి దూరి బీభత్సం సృష్టిస్తున్నాయి. మనుషుల్లాగా తలుపులు తట్టి మరీ లోపలికి చొచ్చుకు వస్తున్నాయి. దీంతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వానరాల నివారణ చర్యలపై పంచాయతీ అధికారులు కనీసం స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.కోతులను బెదిరించే ప్రయత్నం చేస్తే మీదపడి కరుస్తున్నాయి. ఇంటి ముందు పూల కుండీలను ధ్వంసం చేస్తున్నాయి. మొక్కలు పీకేస్తున్నాయి. కోతుల బెడదకు కొందరు ఇంటికి జాలి కట్టి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వారం రోజుల వ్యవధిలో ముగ్గురు కోతుల దాడిలో గాయపడి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. పంచాయతీ అధికారులు స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా సమస్య

జిల్లా కేంద్రంలోనే కాకుండా బెజ్జూరు, కెరమెరి, రెబ్బెన, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల్లోనూ కోతుల సమస్య తీవ్రంగా ఉంది. ఇళ్లలోనే కాకుండా బెజ్జూరు, సిర్పూర్(టి) మండలాల్లో గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లోకి కోతులు దూరి విద్యార్థులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. దాడులు చేయడంతో పలువురికి గాయాలైన ఘటనలున్నాయి. సామగ్రి ఎత్తుకెళుతున్నాయి. జైనూర్‌లో అటవీ



సమీపంలోని చేన్లలోనూ కోతులు గుంపులుగా సంచరిస్తూ పంటలు నష్టపరుస్తున్నట్లు రైతులు వాపోయారు.

పట్టింపేది?కోతులను పట్టేందుకు ప్రత్యేక బృందాలు ఉంటాయి. వారికి ఒక్కో కోతికి కొంత డబ్బును పంచాయతీ వారు చెల్లించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో పంచాయతీ అధికారులు వీటిపై పెద్దగా శ్రద్ధచూపడం లేదన్న విమర్శలున్నాయి. ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా.. అధికారులు పెద్దగా స్పందించడం లేదు. జిల్లాలో ఎక్కడా మంకీ ఫుడ్ కోర్టులు లేకపోవడం.. అడవుల్లో సరైన ఆహారం లభించకపోవడంతో గ్రామాల్లోకి వస్తున్నాయి.

వంటింట్లోకి దూరిన కోతి

మూడురోజుల క్రితం జిల్లా కేంద్రంలోని వాసవీనగర్‌లో ఓ ఇంట్లో దూరిన కోతి సదాశివ్ అనే వృద్ధుడి కాలును కరిచి గాయపరిచింది. అదే కాలనీలో మరో ఇంట్లో ఓ మహిళపై దాడి చేసే ప్రయత్నం చేయగా.. ఆమె త్రుటిలో తప్పించుకుంది. వివేకానందచౌక్‌లోని మరో ఇంట్లో వంటగదిలో చేరి పది నిమిషాల వరకు హడలెత్తించింది. చివరకు శనిగల ముల్లె తీసుకెళ్లింది. శివకేశవ్ మందిర్ వద్ద ఓ ఇంట్లో కోతి చొరబడటంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా జిల్లా కేంద్రంలో బ్రాహ్మణ్‌వాడ, జన్కాపూర్, బజార్‌వాడి, సందీప్‌నగర్, వాసవీనగర్, శివకేశవమందిర్ వీధి, కంచుకోట, పైకాజీనగర్.. అన్ని ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వానరాలు గుంపులుగా వచ్చి ఇళ్లలో చొరబడుతున్నాయి. సామగ్రి చిందర వందర చేస్తున్నాయి.

ఇంట్లోకి వచ్చి కరిచింది

సదాశివ్, వాసవినగర్

ఇంట్లో ఉండగానే ఇటీవల కోతి లోపలికి వచ్చి కాలి మీద కరిచింది. ఆసుపత్రికి వెళితే ఒక టీటీతో పాటు మరో నాలుగు ఇంజక్షన్లు రాశారు. మూడు, నాలుగు రోజుల వ్యవధిలో ఒకటి చొప్పున తీసుకుంటున్నా. మా వీధిలో నిత్యం కోతులు ఇళ్లలోకి చొరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మనుషులపై దాడి చేస్తున్నాయి. ఇంట్లో ఉన్న వస్తువులను ఎత్తుకెళుతున్నాయి. కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.చర్యలు తీసుకుంటున్నాం..- ఉమర్, పంచాయతీ ప్రత్యేక అధికారి

జిల్లా కేంద్రంలో కోతులను పట్టేందుకు సంబంధిత మంకీ/డాగ్ క్యాచర్‌లతో ఇప్పటికే మాట్లాడాం. రెండు మూడు రోజుల్లో వారు వచ్చి వానరాలను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలి పెడతారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

# ఆర్టీసీకి పండగ జోష్..

ఆదిలాబాద్ : దసరా, బతుకమ్మ పండగలు ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించాయి. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఈ నెల 13 నుంచి 24 తేదీల్లో 12 రోజుల్లో రూ.11.81 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే పండగల సీజన్‌లో రూ.10.60 కోట్ల ఆదాయం రాగా.. ఈ సారి రూ.1.20 కోట్లు అధికంగా ఆర్జించడం విశేషం. డిపోలనుంచి రోజువారీగా నడిచే బస్సులతోపాటు పండగల సందర్భంగా హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో సంస్థకు ఆదాయం పెరిగింది. 12 రోజుల్లో అయిదు రోజులు మినహాయించి మిగతా ఏడు రోజులు రూ.కోటికిపైగా ఆదాయం వచ్చింది. ఈ నెల 13న రూ.1.13 కోట్లు, 16న రూ.1.12 కోట్లు, 17న రూ.1.09 కోట్లు, 18న రూ.1.09 కోట్లు, 19న రూ.1.11 కోట్లు, 20న రూ.1.06 కోట్లు, అత్యధికంగా 21న 1.18 కోట్ల ఆదాయం వచ్చింది. పండగలు అయిపోయిన నేపథ్యంలో తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో మరింత ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఫలించిన ముందస్తు ప్రణాళికలు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. పండగల నేపథ్యంలో విద్య, ఉపాధి, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు వేలాది మంది సొంతూళ్లకు రాకపోకలు సాగించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలుచేశారు. ఆయా డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు రోజూ నడిచే బస్సులే కాకుండా ప్రత్యేకంగా హైదరాబాద్‌కు 397 బస్సులను ఏర్పాటు చేశారు. ఇవి 2.11 లక్షల కిలోమీటర్లు తిరగగా రూ.84.14 లక్షల ఆదాయం తీసుకువచ్చాయి. ప్రత్యేక బస్సులే కాకుండా రోజూవారీ బస్సులు రీజియన్ మొత్తం మీద 12 రోజుల్లో 28.07 లక్షల కిలోమీటర్లు మేర తిరిగితే రూ.11.81 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు నగదు కానుకలను అందజేస్తామని ప్రకటించడం సైతం సంస్థకు కలిసొచ్చింది.ప్రయాణికులు వినియోగించుకోవాలిసోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజరు, ఆదిలాబాద్

దసరా, బతుకమ్మ పండగలకు ఆర్టీసీ అధికారులు, కార్మికుల సమష్టి కృషితో సంస్థకు మంచి ఆదాయం వచ్చింది.

# అరరే ఆలస్యంగా వచ్చాయే!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వం సెప్టెంబరు నెల నుంచి క్రీడా సామగ్రి అందించే ప్రక్రియ ప్రారంభించింది. ఇవి దశలవారీగా జిల్లాకు చేరాయి. అయితే క్రీడా సామగ్రి చే రిన రెండు రోజులకే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటిని పూర్తిగా పంపిణీ చేసే అవకాశం లేకపోయింది. చివరి దశలో సామగ్రి ఉభయ జిల్లాల్లోని యువజన క్రీడల శాఖల పర్యవేక్షణలోనే ఉండిపోయాయి. ఖమ్మం జిల్లాలో 110, భద్రాద్రి జిల్లాలో 350 క్రీడా కిట్లు ఆయా కార్యాలయాల్లో ఉన్నాయి.

ఒక్కో కిట్‌లో... ఒక్కో క్రీడా ప్రాంగణానికి అందించేందుకు సిద్ధం



చేసిన సామగ్రిలో క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, డంబెల్స్, అథ్లెటిక్స్ సాధన సామగ్రి ఉంది. యూనిట్ ఖరీదు రూ.36 వేల వరకు ఉంటుంది. ఆలస్యంగా వచ్చిన క్రీడా సామగ్రిని ఇప్పుడు భద్రపర్చడం సవాలుగా మారుతోంది. ఖమ్మం స్టేడియంలో ఎలుకల బెడద ఎక్కువ. దీంతో సామగ్రి ఎంత సురక్షితంగా ఉంటాయో అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. కొత్తగూడెం జిల్లాకు ఆలస్యంగా వచ్చిన సామగ్రిని పాల్వంచ మినీ స్టేడియంలో భద్రపరిచారు. బాగాలేవా... చివరి విడతలో వచ్చిన సామగ్రిలో క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్ బంతులు, ఇతరాలు నాసిరకంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖమ్మం జిల్లాకు ఇప్పటికే 606 స్పోర్ట్స్ కిట్లు, 45,450 క్రీడా దుస్తులు అందినట్టు లెక్కలు చెబుతున్నాయి. వచ్చిన సామగ్రిని వచ్చినట్టే ఎంపిక చేసిన కేంద్రాలను బట్టి అక్కడి ఎంపీడీఓ కార్యాలయానికి అప్పగించారు. తొలి విడత సామగ్రికి ఇప్పుడు అందిన వాటికి పొంతన లేదని నాసిరకం సామగ్రి అంటగట్టారనే చర్చ ఆ శాఖలో ఉంది.

# రూ.లక్షలు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

జమ్మికుంట: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు (ప్రజా మరుగు దొడ్లు) రెండేళ్లుగా నిర్వహణ లేక మూత పడి ఉంటున్నాయి. పుర అధికారుల పర్యవేక్షణ కొరవడి రూ.60 లక్షల వ్యయంతో అన్ని హంగులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లతో ఫలితం లేకుండా పోతోంది. దీనికితోడు జన సంచారం లేని స్థలాలలో మరుగుదొడ్లను నిర్మించటంతో ప్రయోజనం లేదని స్థానికులు అంటున్నారు.

జన సంచారం లేని చోట నిర్మాణం..!

జమ్మికుంట పుర పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు, సాన్నపు గదులను అన్ని హంగులతో నిర్మించారు. జమ్మికుంట బస్టాండ్ సమీపంలోని వాటర్ ట్యాంక్, నాయిన్‌చెరువు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రోడ్డు వద్ద, కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద రెండేళ్ల క్రితం నిర్మించారు. ప్రజా మరుగుదొడ్ల ముందు భాగాన దుకాణాలను నిర్వహిస్తుండటంతో అవి కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. స్థానిక ప్రజా పరిషత్తు కార్యాలయం ముందు, జన సంచారం లేని నాయిన్ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్‌కు తాళం వేసి ఉంటుందని స్థానికులు అంటున్నారు. స్థానిక పుర పరిధి కొత్తపల్లి ఆర్వోబీ వంతెన కింద నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ల ప్రారంభోత్సవం అనంతరం తెరుచుకోలేదని కొత్తపల్లి వాసులు అంటున్నారు. వాటి నిర్వహణకు పుర అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జమ్మికుంటలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వాటి నిర్మాణానికి స్థలాల ఎంపికలో సరైన నిర్ణయం తీసుకోకపోవడంతోనే ఇబ్బందులు తప్పటం లేదు. నిర్వహణకు విధించిన నిబంధనలు పరిశీలించి గుత్తేదారు రోజూ నిర్వహణ చేసేలా చేస్తాం. బి.శ్రీనివాస్, కమిషనర్, పురపాలక సంఘం, జమ్మికుంట

# చేప పిల్లల పంపిణీలో జాప్యం

మంచిర్యాల : జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో చేపపిల్లలను పెంచే పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వానాకాలం ప్రారంభంలో పిల్లలను వేయాల్సి ఉండగా సీజన్ ముగింపు దశకు చేరినప్పటికీ ప్రక్రియను ముగించకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను సకాలంలో చెరువుల్లో వేయకపోవడం వల్ల వేసవి నాటికి ఇబ్బందులు ఎదురవుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ఏటా జులై నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి చేపపిల్లలను తరలించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నేటికి పూర్తిస్థాయిలో చేప పిల్లలను వేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నత్తనడకన కొనసాగుతున్న చేపపిల్లల పంపిణీపై కథనం.

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపల ఎగుమతులు పెంచాలనే లక్ష్యంతో రూపొందించిన చేపల పెంపకం పథకం కొంత మంది అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతుంది. జిల్లాలో ఈ ఏడాది సకాలంలోనే విస్తారంగా వర్షాలు కురిసి అనేక చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు నీటితో నిండినప్పటికీ మత్స్యశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పిల్లల పెంపకం పనుల్లో జాప్యం ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జులై నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి చేపపిల్లల విత్తనాలను చెరువుల్లో వదలాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో నేటికి చేపపిల్లలను చెరువులు, జలాశయాల్లో వదిలే పనులు పూర్తి చేయక పోవడంపై మత్స్యకారులు మండిపడుతున్నారు. చేపపిల్లలను సకాలంలో వేస్తేనే వేసవి నాటికి తగినంత బరువు పెరుగుతాయని లేనిపక్షంలో వాటిలో ఎదుగుదల లోపిస్తుందని మత్స్యకారులు వాపోతున్నారు. ఎదుగుదల సరిగా లేకపోవడంతో పాటు వేసవిలో పలు చెరువుల్లో నీటి కొరత ఏర్పడుతున్న కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో పట్టుకొని విక్రయించాల్సి వస్తుందంటున్నారు. ప్రభుత్వ సహకారంతో వేమనపల్లి, కరీంనగర్‌లోని వీణవంక, చెన్నూరు ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెంచిన చేప పిల్లలను కొనుగోలు చేసి స్థానిక చెరువుల్లో పెంచేందుకు పంపిణీ చేస్తున్నారు. వేసవి నాటికి ఎదుగుదల సరిగా లేకపోవడంతో మత్స్యకారులు సరైన ఆదాయం పొందలేకపోతున్నారు. ఒక్కో చేప కనీసం కిలో మేరకు ఎదిగితే మత్స్యకారులకు మేలు కలుగుతుందని వాపోతున్నారు. పంపిణీలో జాప్యంపై మత్స్యశాఖ అధికారులను వివరణ కోరగా ఈ ఏడాది వర్షాలు భారీగా కురవడంతో అనేక చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీటి వరద కొనసాగిందన్నారు. వరదలో పిల్లలు కొట్టుకుపోయే అవకాశం ఉండటంతో పంపిణీ చేయలేకపోయామన్నారు. ఈ నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

# అధ్వానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కన్నాయిగూడెం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుధ్యం పడకేసింది. వ్యాధులబారిన పడి ఆసుపత్రికి వచ్చే వారికి అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ అధ్వానంగా మారింది. ఒక వైపు సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతుండగా, వైద్య సేవల కోసం ఇక్కడికి వచ్చాక తమకు కొత్తగా వ్యాధులు సోకుతాయనే భావన రోగుల్లో కనిపిస్తున్న సందర్భాలు అనేకం. పీహెచ్‌సీ ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఆసుపత్రి ఆవరణలో చిన్నపాటి చెరువును తలపించే విధంగా వర్షం నీరు నిల్వడంతో.. దోమలకు నిలయంగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న గుత్తేదారు వర్షం నీరు వెళ్లకుండా మట్టిపోయడంతో.. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజలకేనా ఆరోగ్య సూత్రాలు

ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాధారణంగా ప్రతి డ్రైడేగా పాటిస్తూ.. ఆయా ప్రాంతాల్లో ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తుంటారు. అలా ప్రజలకు ఆరోగ్య సూత్రాలు చెబుతున్న ఆరోగ్య అధికారులు.. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో నిల్వ నీటికి చర్యలు చేపట్టడం లేదు. పీహెచ్‌సీలో డ్రైడే, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌సీ నిర్వహణకు ఏటా ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుండగా, వాటితో ఏం చేస్తున్నారో తెలియడం లేదు.

పెరుగుతున్న రోగుల తాకిడి..

రోజురోజుకు ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతోంది. గత మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్, ఇప్పటి ఐటీడీఏ పీవో అంకిత్ పీహెచ్‌సీకి కావాల్సిన పరికరాలు, సౌకర్యాల ఏర్పాటుకు నిధులను మంజూరు చేశారు. దీంతో కన్నాయిగూడెం పీహెచ్‌సీలో వైద్యసేవల నాణ్యత పెరిగింది. ఆసుపత్రికి ఎక్కువ విస్తీర్ణం కల్గిన భవనం, రోగుల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తే మరింత మెరుగైన సేవలు ప్రజలు పొందగల్గుతారు. ఏదైనా అత్యవసరమైతే ఇక్కడి ప్రజలు ఏటూరునాగారం, వరంగల్ వెళ్లాల్సి వస్తుంది. ఈ క్రమంలో పీహెచ్‌సీని మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కోతకు వచ్చిన వరి.. కొనుగోళ్లకు సన్నద్ధం



మహబూబాబాద్ : జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు రెండు లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 2.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వాటిని అంచనా. కోత దశకు వచ్చిన వరి పంట నూర్పిడి చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతుండగా అధికారులు సన్నద్ధమవుతున్నారు. గత వానాకాలం, యాసంగి సీజన్‌లో వాహనాల కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వాహనాలు సకాలంలో రాకపోవడంతో అవస్థలు పడ్డారు. సరిపడా వాహనాలు సమకూర్చాలని కోరుతున్నారు. మిల్లర్లు కూడా ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు రాకుండా..

ధాన్యం కొనుగోలులో గతంలో ఎదురైన సమస్యలు రాకుండా కార్యాచరణ రూపొందించుకుని వానాకాలం ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతున్నారు. 2023 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై ఇటీవల కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు సమస్యలు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ పలు సూచనలు చేశారు. అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ల కొరత లేకుండా అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 చెల్లించనున్నారు.

ముందస్తుగా ఏర్పాటు చేయాలి-కె.మధుసూదన్‌రెడ్డి, రైతు, దంతాలపల్లి

మాది దంతాలపల్లి గ్రామం. ఎకరంన్నర వరివేశా. ప్రతిసారి కోతలకు ముందుగానే కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు పంపించవచ్చు. కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి.

ఇబ్బందులు రానివ్వం- కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

ఖరీఫ్ సీజన్ 2023లో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి. నాణ్యమైన ధాన్యం తేవాలి.

# పల్లె, పట్నం కలబోత.. చైతన్యానికి ప్రతీక

జనగామ : ఏడు పదుల ఎన్నికల చరిత్ర కలిగిన జనగామ నియోజకవర్గం హైదరాబాద్ స్టేట్‌లో, ఆపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. నియోజకవర్గాల పునర్విభజన, జిల్లాల పునర్వ్యవస్థీకరణ వంటి అనేక రాజకీయ, సామాజిక మార్పులకు సాక్షిగా ఉన్న ఈ శాసనసభ నియోజకవర్గం ఇటు జనగామ, అటు సిద్దిపేట జిల్లాల్లో విస్తరించింది. ఘన చరిత్ర..తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వేదికగా, నక్సల్స్ ఉద్యమానికి వెన్నుదన్నుగా, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊతంగా నిలిచిన ఘన చరిత్ర జనగామ నియోజకవర్గానిది. కొమురవెల్లి మల్లన్న, కొడవటూరు సిద్ధన్న, బెక్కల్ రామలింగేశ్వర స్వామి క్షేత్రాలతో ఆధ్యాత్మిక ప్రాంతంగా విలసిల్లుతోంది. మరో జలియన్ వాలాబాగ్‌గా పేరు గాంచిన వీర బైరాన్‌పల్లి, హస్తకళలకు విశ్వఖ్యాతి పేరు గడించిన పెంబర్తి ఇక్కడివే. దేవాదుల ఎత్తిపోతల పథకంలో నిర్మించిన జలాశయాలతో ఏటా మూడు పంటల సాగుతో ధాన్యాగారంగా ప్రసిద్ధి పొందుతోంది.

సంక్షిప్తంగా..ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ కార్పొరేషన్ తర్వాత పాత పురపాలికగా, తాలూకా, సమితి, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న జనగామ జిల్లా హోదాను సంతరించుకుంది.

జనగామ నియోజకవర్గం (నెంబరు 98) జనగామ, జనగామ రూరల్, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల, చేర్యాల పట్టణం, చేర్యాల రూరల్ మద్దూరు, ధూల్మిట్ట, కొమురవెల్లి మండలాలతో పాటు జనగామ, చేర్యాల పురపాలికలతో కూడి ఉంది. మొత్తం పంచాయతీలు 131. 1952లో ఏర్పడిన జనగామ నియోజకవర్గానికి 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 16వ ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది.




1999 నుంచి 2009 వరకు పొన్నాల లక్ష్మయ్య వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన నేతగా రికార్డు సృష్టించారు. మొత్తంగా ఆయన ఎనిమిది ఎన్నికల్లో పోటీ చేసి నాలుగు సార్లు విజయం సాధించారు. నలుగురు ముఖ్యమంత్రుల సారథ్యంలో మంత్రిగా పనిచేశారు. పీసీసీ అధ్యక్షుడయ్యారు. ఇటీవల భారాసలో చేరారు. ఎమ్మెల్యేగా పనిచేసిన కమాలుద్దీన్ అహ్మద్ తర్వాత వరంగల్ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా, విదేశీ రాయబారిగా ఎదిగారు.

అభ్యర్థులు

భారాస.. పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భాజపా.. ఆరుట్ల దశమంతరెడ్డి

కాంగ్రెస్.. ప్రకటించాల్సి ఉంది..

నియోజకవర్గ ఓటర్ల వివరాలు

పురుషులు 1,14,626

మహిళలు 1,14,973

ఇతరులు 10

మొత్తం 2,29,609

సర్వీస్ ఓటర్లు132

ఎన్ఆర్ఐలు 7

# కొంచెం మోదం.. ఇంకొంచెం ఖేదం..!

ఖమ్మం : పంటల ఎదుగుదల, అధిక దిగుబడులు, చీడపీడల నుంచి రక్షణ కల్పించే 'పొటాష్'.. ధరలు స్వల్పంగా తగ్గటం అన్నదాతలకు ఊరట కలిగించే అంశం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పత్తి, మిరప, వరి, తదితర ప్రధాన పంటలకు ఈ ఎరువును ఎక్కువగా ఉపయోగిస్తారు. రెండేళ్లుగా పొటాష్ కొనలేక రైతులు సతమతమవుతున్న తరుణంలో కొన్ని కంపెనీలు స్వల్పంగా ధర తగ్గించి యాసంగి సీజన్‌కు కర్షకులపై కొంతభారం తగ్గించాయి. ఇప్పటివరకు 50కిలోల బస్తా రూ.1,700 ఉన్న మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ) ధరను రూ.75 తగ్గించి రూ.1,625కు విక్రయించనున్నట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. భారతదేశంలో పొటాష్ తయారీ కర్మాగారాలు లేవు. రష్యా, కెనడా, బెలారస్ తదితర దేశాల నుంచి కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటుంది. ఐపీఎల్, క్రిబ్‌కో, చంబల్, మొజాయిక్, సీఈఎల్, పీపీఎల్ వంటి కంపెనీల ద్వారా రైతులకు సరఫరా చేస్తోంది. చైనా మాత్రం తమ రైతుల ప్రయోజనాలు కాపాడుకునేందుకు ఎగుమతుల్ని



పరిమితం చేసింది. ప్రస్తుతం సదరు కంపెనీలు భారత్ పొటాష్ పేరిట పాత ధరలకే విక్రయిస్తుండగా, సీఈఎల్ కంపెనీ మాత్రం ధరలను తగ్గించింది. మరికొద్దిరోజుల్లో ఇతర కంపెనీలూ ధరలను తగ్గించే అవకాశముంది.

పెరిగిన సింగిల్ సూపర్ పాస్ఫేట్ ధర...

గత వానాకాలం ప్రారంభం నుంచి రూ.535 పలికిన సింగిల్ సూపర్ పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) ధర.. యాసంగిలో రూ.600 వరకు పెరిగింది. బస్తాకు రూ.65 చొప్పున రైతులపై భారం పడింది. పెరిగిన ధరలు ఈనెల 20 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఆయా కంపెనీలు వెల్లడించాయి. డీలర్ల వద్ద ఉన్న పాత నిల్వలు పాత ధరలకే విక్రయించాల్సి ఉంటుందని తెలిపాయి.

# విభిన్న పార్టీలు..ఈ గ్రామాలు...

సిరిసిల్ల: నేరెళ్ల, మెట్‌పల్లి, బుగ్గారం, ఇందుర్తి, మేడారం ఇవన్నీ తెలిసిన పేర్లే అనుకుంటున్నారా! ఆగండి. వాటికో ప్రత్యేకత ఉంది. ఇవన్నీ ఒకప్పుడు శాసనసభ నియోజకవర్గాల పేర్లు. 1957 నుంచి 2009 నియోజకవర్గాల పునర్విభజన వరకు అసెంబ్లీ నియోజకవర్గాలుగా ఒక వెలుగు వెలిగిన ప్రాంతాలు. వీటిలో కొన్ని ఇప్పుడు మండల కేంద్రాలు కాగా, ఒకటి పురపాలక సంఘంగా ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటేనే పోరాటాల పుట్టినిల్లు. 1952లో తొలి ఎన్నికలు జరిగే నాటికి కమ్యూనిస్టులపై నిషేధం ఉండటంతో వారంతా పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ పేరుతో పోటీ చేయగా కాంగ్రెస్‌కు గట్టి పోటీనిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎంతో మంది ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల నేపథ్యంలో ఈ నియోజకవర్గాల గురించి, వాటి ప్రస్తుత పరిస్థితిపై ఒకసారి అవలోకనం చేసుకుందాం.

1957లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఆది నుంచి కాంగ్రెస్, తెదేపా, స్వతంత్ర అభ్యర్థుల మధ్య పోరు నడిచింది. మొదటి ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1978లో ఇందిరా గాంధీ ప్రభంజనంలో కాంగ్రెస్ అభ్యర్థిగా అంబల్ల రాజారాం, 1983లో కడకంట్ల గంగారాం గెలుపొందారు. 1985, 1994లో శికారి విశ్వనాథం (తెదేపా), 1989, 1999, 2004లో జువ్వాడి రత్నాకర్‌రావు తొలుత స్వతంత్ర అభ్యర్థిగా తర్వాత వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్సార్ మంత్రి వర్గంలో దేవాదాయశాఖ మంత్రిగా పని చేశారు. 2009లో ఈ నియోజకవర్గం పెగడపల్లి, గొల్లపల్లి, మేడారం, వెల్గటూరు, ధర్మారం, బుగ్గారం, ధర్మపురి మండలాలతో ధర్మపురి (ఎస్సీ రిజర్వుడు) నియోజకవర్గంగా మారింది. 2016 జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటులో బుగ్గారం 11 గ్రామాలతో మండల కేంద్రమైంది.

1957లో ఏర్పడిన ఈ నియోజకవర్గం నుంచి జనరల్ స్థానంలో పీడీఎఫ్ నుంచి జి.లక్ష్మారెడ్డి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983, 1989లో రెండు సార్లు కాంగ్రెస్ తరఫున, 1999లో తెదేపా తరఫున మాతంగి నర్సయ్య మొత్తం మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో చివరిసారి కొప్పుల ఈశ్వర్ ఎన్నికయ్యారు. కాకతీయుల సామంతుడు మేడరాజు పాలనకు సాక్ష్యంగా ఇక్కడ నందిని ఏర్పాటు చేశారు. ధర్మారం మండలంలోని నందిమేడారం గ్రామంగా ప్రాచుర్యంలో ఉంది. పేరుకే ఇది నియోజకవర్గ కేంద్రమైనా ప్రభావం అంతా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే ఉండేది. ప్రస్తుతం ఈ గ్రామం ధర్మపురి నియోజకవర్గంలో ఉండగా రామగుండం ప్రత్యేక నియోజకవర్గమైంది.

1962లో ఏర్పడిన ఈ నియోజకవర్గం జనరల్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా 1967లో కాంగ్రెస్ తరఫున కేవీ నారాయణరెడ్డి గెలుపొందారు. 1972, 1978లో స్వతంత్ర జనతా పార్టీ నుంచి పరిపాటి జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. 1985, 1989, 1994, 1999లలో తెదేపా నుంచి ముద్దసాని దామోదర్‌రెడ్డి ఎన్నికయ్యారు. చివరగా 2004లో ఈటల రాజేందర్ గెలుపొందారు. 2009లో హుజూరాబాద్‌లో కలిసింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కమలాపూర్ మండలం జిల్లాల పునర్విజనలో హనుమకొండలో కలిసింది.

మెట్‌పల్లి: ఖాదీ వస్త్రాలకు చిరునామాగా నిలిచిన ఈ పట్టణానికి ఉమ్మడి జిల్లాలో ఎంతో ప్రత్యేకత ఉంది. 1957లో జనరల్ స్థానంగా ఏర్పడిన ఈ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యేగా పీడీఎఫ్ పార్టీ నుంచి జె.ఆనందరావు ఎన్నికయ్యారు. కాంగ్రెస్, భాజపా, స్వతంత్ర అభ్యర్థులు వివిధ ఎన్నికల్లో గెలిచారు. భాజపా సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు 1985, 1989, 1994లో మూడు సార్లు జయకేతనం ఎగురవేశారు. నియోజకవర్గం రద్దయిన 2004లో చివరిసారిగా కొమిరెడ్డి రాములు జేపీ పార్టీ తరఫున ఎన్నికయ్యారు. ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా కొనసాగిన మెట్‌పల్లి తర్వాత కోరుట్ల నియోజకవర్గంలో కలిసిపోయింది. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ప్రముఖ పురపాలక సంఘంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా కొనసాగుతోంది. ఇక్కడ రాజకీయ, వాణిజ్య కార్యకలాపాలు చురుగ్గా సాగుతున్నాయి.


సిరిసిల్ల నియోజకవర్గం తంగళ్లపల్లి మండలంలో ఉన్న ఈ గ్రామం నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. 1952లో ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున బండారి జానకీరాం తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972లలో స్వతంత్ర అభ్యర్థిగా గొట్టె భూపతి గెలిచారు. 1978, 1983, 1989లలో కాంగ్రెస్ నుంచి పాటిరాజం ప్రాతినిధ్యం వహించారు. 1994, 1999లలో తెదేపా నుంచి సుద్దాల దేవయ్య, 2004లో చివరగా భాజపా నుంచి కాసిపేట లింగయ్య గెలుపొందారు. తర్వాత పూర్తిగా సిరిసిల్ల నియోజకవర్గంలో కలిసి ప్రస్తుతం గ్రామ పంచాయతీగా కొనసాగుతోంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తెలంగాణ సాయుధ పోరాటానికి వేదికగా నిలిచిన హుస్నాబాద్ ప్రాంతంలోనిదే ఈ నియోజకవర్గం. 1957లో ఈ జనరల్ స్థానం నుంచి పీడీఎఫ్ తరఫున పి.చొక్కారావు తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972లో ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు బద్దం ఎల్లారెడ్డి ప్రాతినిధ్యం వహించారు. 1978, 1985, 1989లో మూడు సార్లు దేశిని చినమల్లయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో చాడ వెంకట్‌రెడ్డి చివరి సారి ఎన్నిక కాగా, 2009లో ఈ నియోజకవర్గం కొహెడ, చిగురుమామిడి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హుస్నాబాద్, సైదాపూర్ మండలాలతో కలిపి హుస్నాబాద్ నియోజకవర్గంగా ఏర్పడింది. చిగురుమామిడి మండలంలో ఇందుర్తి ఒక గ్రామంగా ఉంది.

# యశస్వి.. భవితకు దిక్సూచి

భువనగిరి : పాఠశాల విద్యార్థులు పరీక్షలు ముగిశాయి. తాజాగా ప్రగతి పత్రాలను కూడా అందుకున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. సెలవుల్లో చదువుకు సానబెట్టి ప్రతిభ చూపి ఉపకార వేతనం పొంది ఆర్థిక అవసరం తీర్చుకునే మంచి తరుణం ఇది. 'పీఎం యశస్వి' ఉపకార వేతన పథకం పేర కేంద్ర సర్కారు గతేడాదే రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా'. ఇప్పటి వరకు ఉన్న అతిపెద్ద ఉపకార వేతన పథకాల్లో ఇది కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ పథకం నడుస్తుంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 1100 ఉన్నత పాఠశాలలుంటే ఎనిమిది, తొమ్మిది, పదోతరగతిని ఇటీవలనే పూర్తి చేసుకున్నవారు సుమారు 82,273 మంది విద్యార్థులున్నారు.

అర్హులు ఎవరంటే..?విద్యార్థి భారతీయుడై ఉండి, కేంద్ర విద్యాశాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి. ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎనిమిదో తరగతి పూర్తయి ఉండాలి. 9, 10 తరగతులు పూర్తయినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు (ఇంటర్ వరకు) మాత్రమే ఉపకార వేతనం లభిస్తుంది. సదరు విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2.5 లక్షలకు మించొద్దు. గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.



దరఖాస్తు ఇలా చేయాలి...

ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు కావాలి. పేరు, ఈ- మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారుడికి అప్లికేషన్ నంబర్ వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపుకార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్‌కాపీలను అప్‌లోడ్ చేసి సైన్‌అప్ కావాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశకార్డు జారీచేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష ఈ విధంగా..ఎంపిక చేసిన కేంద్రాల్లో మూడు గంటలపాటు కొనసాగే పరీక్షలను హిందీ, ఇంగ్లిషు భాషల్లో నిర్వహిస్తారు. ఎలాంటి పరీక్ష రుసుం ఉండదు. పత్రంలో వంద బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కుల కోసం 30 ప్రశ్నలు, సైన్స్‌లో 80 మార్కులకు 20 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశ వ్యాప్తంగా సుమారు 78 నగరాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. గతేడాది సెప్టెంబరు 11న పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 26తో దరఖాస్తు గడువు పూర్తి కానుంది.

అర్హత సాధించిన అనంతరం..9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియట్ లేదా 11, 12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షలు ఉపకార వేతనం ఒకేసారి సంబంధిత ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు ఎంపికైన విద్యార్థులు ఉపకార వేతనం కోసం తిరిగి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటున్నారో ఆ బ్యాంకు పాసుపుస్తకం ఫొటోకాపీని జతచేయాలి. ఉపకారవేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏ పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు విద్యను అభ్యసించవచ్చు. ఆ పాఠశాలల వివరాల లింకు కూడా ఆ వెబ్‌సైట్‌లో ఉంటుంది.

# ఆరంభ శూరత్వమే.. నిర్వహణ అంతంత మాత్రమే

నల్గొండ : గ్రామాలను పరిశుభ్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రత్యేక కార్యాచరణతో ప్రతి పల్లెలో ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా చెత్తశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి పోగవుతున్న వ్యర్థాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి పంచాయతీకి సంపద సమకూర్చాలని ప్రభుత్వం భావించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతి పల్లెలో చెత్త డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేసినప్పటికి స్థానిక అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.

నిర్వహణ అస్తవ్యస్తం

ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెల్లో పోగైన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించి చెత్తను తడి,పొడిగా వేరు చేసి ఎరువుగా మార్చాల్సిన సిబ్బంది వాటిని దహనం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీంతో పరిసర ప్రాంతమంతా పొగతో నిండిపోతోంది. మరికొన్ని గ్రామాల్లో పూర్తిగా వ్యర్థాలను చెత్త శుద్ధి కేంద్రాలకు తరలించకుండానే వాగులు, వంకల్లో పారబోస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నట్లు స్థానిక అధికారులు లెక్కలు చూపిస్తు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇంకొన్ని పంచాయతీల్లో రైతులు పశువుల పాకగా మార్చుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల నిధులతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

కనగల్ మండలం చర్ల గౌరారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త శుద్ధి కేంద్రం (వర్మికంపోస్టు షెడ్డు) ఇది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన షెడ్డు నిరుపయోగంగా మారింది. షెడ్డు పైభాగం కప్పు గాలికి లేచిపోయింది. అక్కడ చెత్త వేసింది లేదు. ఎరువును తయారు చేసింది లేదు.

వట్టి మాటలే..!

ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ పంచాయతీలను గుర్తిస్తూ ప్రోత్సహిస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ పేరిట పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేయడంతో పాటు నిధులు మంజూరు చేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ పంచాయతీల్లో రాష్ట్రం నుంచి 30 గ్రామాలు ఎన్నికవగా.. అందులో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి మహిళా విభాగంలో ఏపూరు గ్రామపంచాయతీ ఎన్నికైంది. మరి పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, చెత్తశుద్ధి, సేంద్రియ ఎరువు తయారీలో వెనుకంజలో ఉన్నాం. ప్రభుత్వం ఆశించిన మాదిరిగా పల్లెల్లో పోగవుతున్న వ్యర్థాలను శుద్ధి చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# అక్రమ డిప్యుటేషన్లకు ఆశ్రమం




కొత్తగూడెం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ విద్యాలయాల్లో ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రుకు తెలియకుండా డీడీ రమాదేవి, మరో అధికారితో కలిసి పలువురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై కావాల్సిన చోట పోస్టింగ్ తెచ్చుకున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో పీఓ ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంతమంది? ఎక్కడెక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారో నిగ్గు తేల్చాలని ఈ నెల 25న త్రిసభ్య కమిటీని నియమించారు. అంతకుముందే ఆయన స్థానిక తహసీల్దార్లతో విచారణ జరిపించి అక్రమ డిప్యుటేషన్లు జరిగింది వాస్తవమేనని నిర్ధారించుకున్నారు.

త్రిసభ్య కమిటీ నియామకం

2022-23 విద్యా సంవత్సరంలో సంక్షేమాధికారుల అక్రమ డిప్యుటేషన్లు గుర్తించిన పీఓ ఇటీవల వాటిని రద్దు చేశారు. ఇదే సమయంలో గత ఐదు నెలల్లో కొందరు ఉపాధ్యాయులకు డీడీ, మరో అధికారి నోటి మాటలతో కోరిన పోస్టింగులు ఇప్పించారు. ఉన్నతాధికారులు కావడంతో హెచ్.ఎం.లు ఉత్తర్వుల్లేకున్నా ఆదేశాలు పాటించారు. జిల్లాలో 39 విద్యాలయాలుండగా ఇప్పటివరకు 22 మంది అక్రమంగా డిప్యుటేషన్లు పొందినట్లు పీఓ విచారణలో తేలింది. సుమారు మరో 18 మంది అడ్డదారిలో ప్రయోజనం పొంది ఉండొచ్చని అంచనా. విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్లను విద్యాలయాలకు పంపి కూపీ లాగించిన పీఓ, ఆ తర్వాత త్రిసభ్య కమిటీని నియమించారు. ఈఅంశంపై విచారణ జరుగుతోందని, తానేమీ మాట్లాడనని డీడీకు తెలిపారు. 'హెచ్.ఎం.ల సమావేశం అనంతరం ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లపై పీఓ కమిటీ నియమించారు. విద్యాలయాల ప్రధానోపాధ్యాయుల నుంచి అన్ని విషయాలు తెలుసుకుంటున్నాం. పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు అక్రమ డిప్యుటేషన్లపై పనిచేస్తున్నట్లు తేలింది. వారికి వేతనాలు ఎలా చెల్లించారు? ఎవరు నియామకం చేయమన్నారో రాతపూర్వకంగా తెలుసుకుంటున్నాం. అనంతరం పీఓకు నివేదిక అందజేస్తాం.' దేవిడ్‌రాజ్, త్రిసభ్య కమిటీ ఛైర్మన్, ఐటీడీఏ ఏపీఓ

# బస్తీ దవాఖానాలకు సుస్తీ!




ఇల్లెందు : బస్తీ దవాఖానాల పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి 10 వేల మందికి ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయించి తదనుగుణంగా చర్యలు చేపట్టింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పురపాలికల పరిధిలో బస్తీ దవాఖానాలు ఆశించిన స్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. నేటికి వైద్యశాలలకు స్థలాలు కేటాయించకపోవడం, భవనాల మరమ్మతులు, పూర్తయిన దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం తదితర సమస్యలు వెంటాడుతున్నాయి.

దశల వారీగా ఏర్పాటు చేస్తున్నాం

శిరీష, డీఎంహెచ్ఓ, భద్రాద్రి

పురపాలికల పరిధిలో దశల వారీగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నాం. దవాఖానాల నిర్మాణం పూర్తయిన వాటిలో వైద్యులు, సిబ్బందిని నియమించి సేవలందిస్తున్నాం. త్వరలో మిగిలిన దవాఖానాలు పూర్తి చేస్తాం. దవాఖానాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పురపాలికల్లో ఇదీ పరిస్థితి...కొత్తగూడేనికి రెండు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. ఒకటి పూర్తయి వైద్యసేవలు అందిస్తోంది. మరొక దవాఖానా నిర్మాణ దశలో ఉంది.

పాల్వంచలో ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించారు.ఇల్లెందుకు రెండు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. ఆర్అండ్ఆర్ కాలనీలో ఒకటి పూర్తయింది. 3వ వార్డులో మరో దవాఖానా ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి. పూర్తయిన దవాఖానాలో వైద్యులు, సిబ్బందిని నియమించలేదు.మణుగూరులో బస్తీ దవాఖానా అవసరం ఉన్నప్పటికీ కనీసం ఒక్కటి కూడా మంజూరు కాలేదు.మధిరలోని మడుపల్లి ఏరియాలో ఒక బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందిని నియమించారు.సత్తుపల్లికి మూడు బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. అందులో రాజీవ్‌కాలనీలో నిర్మించిన దవాఖానాలో వైద్యులు, సిబ్బంది నియమించారు. ఇంకా రెండు బస్తీ దవాఖానాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.వైరాకు కనీసం ఒక్క బస్తీ దవాఖానా కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం.

# వీడని వర్షాలు.. అన్నదాతకు తీరని కష్టాలు

వరంగల్ : అన్నం పెట్టే అన్నదాతకు అడుగడుగునా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. సమస్యలను ఎదుర్కొని సాగు చేసిన పంట చేతికొచ్చే వేళ కురుస్తున్న అకాల వర్షాలు వారి బతుకులను చిదిమేస్తున్నాయి. యాసంగిలో వేసిన వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని 13 మండలాల్లో నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాలతో పాటు పర్వతగిరి, సంగెం, వర్ధన్నపేట మండలాల్లో పంటలు దెబ్బతినగా కొన్ని చోట్ల మామిడి కాయలు రాలి నష్టాలను మిగిల్చాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన ఈదురుగాలుల వానకు వరి, మొక్కజొన్న చేన్లు కలిపి 10వేల ఎకరాల్లో నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి 30 శాతం దెబ్బతిన్న పంటలను సేకరించనున్నట్లు ఓ అధికారి తెలిపారు.రెండేళ్లుగా ఇదే పరిస్థితి..ప్రకృతి ప్రకోపానికి రెండేళ్లుగా పూర్తిగా పంటలను కొల్పోతున్నారు. వరుసగా దెబ్బ మీద దెబ్బ తగలడంతో హలదారులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. 2022 జనవరి 12న రాత్రి ఈదురు గాలులతో పెద్ద ఎత్తున వడగండ్లు కురవడంతో జిల్లాలో దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, ఖానాపురం మండలాల్లో పలు గ్రామాల్లో మిర్చి, మొక్కజొన్న పంటలు మట్టి కొట్టుకుపోయాయి. ఈసారైనా కలసి వస్తుందనుకుంటే గత మార్చి 18న ఈదురు గాలులతో భారీగా కురిసిన అకాల వర్షానికి దుగ్గొండి, చెన్నారావుపేట, నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల్లో మిర్చి, మొక్కజొన్న, వరి పంటలు బాగా దెబ్బతిన్నాయి.

మార్కెట్‌కు తెస్తే కొట్టుకుపోయాయి

ఆరుగాలం శ్రమిస్తే అరకొరగా పండిన మొక్కజొన్నలను అమ్మడానికి మార్కెట్ యార్డుకు తెచ్చి కుప్పలు పోస్తే.. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి పలువురి రైతుల మక్కలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. నోటిదాకా వచ్చిన పంట కళ్లెదుటే నీటి పాలైతే ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో గుండెలు బాదుకుంటూ బాధిత రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు చాపల మధు, చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట. ఎకరంన్నర భూమిలో మొక్కజొన్న పంట వేశాడు. చేతికి వచ్చిన పంట అకాల వర్షానికి పూర్తిగా నేలపాలైంది. కంకి పూర్తిగా తడిసి చేతికి రాకుండా పోయిందని, రూ.30వేల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.నీటిలో తడిసిన వరిని చూపుతున్న రైతు రాదారపు నరేశ్‌బాబు, నల్లబెల్లి మండలం కొండాయిలుపల్లి. సొంత భూమికి తోడు రెండెకరాలు కౌలుకు తీసుకొని ఐదెకరాల్లో వరి, మొక్కజొన్న వేశారు. ఆది, మంగళవారం రాత్రి కురిసిన వానకు వరి, మొక్కజొన్న నేలవాలి పనికి రాకుండా పోయింది. వ్యవసాయాధికా రులు పంట నష్టంపై సర్వే చేయడానికి రావట్లేదు.ఎంత తేడా? చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామానికి చెందిన రైతు కోరే రమేశ్ నాలుగెకరాల్లో వరి సాగు చేయగా, పైరు ఏపుగా పెరిగి దట్టంగా వరి కంకులు వేసింది. మంచి దిగుబడి వస్తుందని మురిసి పోయాను. రెండ్రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు 70 శాతం గింజలు రాలిపోయాయి.

అప్పు మిగిలింది..- వీరన్న, రాములునాయక్‌తండా, నర్సంపేట

మహేశ్వరం శివారులో ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. మూడెకరాల్లో పంట దెబ్బతిన్నగా, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు మిగిలింది. గతేడాది కురిసిన వడగండ్లకు రూ.లక్ష వరకు నష్టపోయాను.

పైసా పరిహారం ఇవ్వలేదుగద్దె సారయ్య, నల్లబెల్లి

నాలుగెకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. నిరుడు ఇదే పరిస్థితి. ఈ ఏడాది కలిసి వస్తుందనుకుంటే మళ్లీ కష్టాలు, కన్నీళ్లనే మిగిలాయి. లక్షల రూపాయల్లో నష్టం జరిగింది. వడగండ్ల వానతో నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం గతంలో పైసా పరిహారం ఇవ్వలేదు.

క్షేత్రస్థాయిలో సర్వే చేస్తాం- ఉషాదయాల్, జిల్లా వ్యవసాయాధికారి, వరంగల్అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు సేకరిస్తాం. ఇప్పటికే తమశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో సందర్శించి వివరాల సేకరిస్తున్నారు. ప్రాథమికంగా 10 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

# సమయం సద్వినియోగం.. మెదడు ఉత్తేజభరితం

మిర్యాలగూడ : విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. .ఇన్నాళ్లు నిత్యం పాఠశాలకు వెళ్తూ..పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు..సెలవుల్లో ఏం చేయాలి.. సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియక తల్లిదండ్రులు తికమక పడుతుంటారు. నిత్యం ఆటలతోనే సమయం గడిపితే..సెలవుల అనంతరం చేతికి రారేమో అన్న ఆందోళన సైతం తల్లిదండ్రుల్లో ఉంటుంది. చదువుకు సంబంధించిన, శారీరక క్రీడల శిక్షణతో పాటు మెదడుకు మేత పెట్టేలా పలు క్రీడల్లో తర్ఫీదు పొందేందుకు చిన్నారులకు అవకాశం ఇవ్వాలి. మెదడును ఉత్తేజ పరిచే క్రీడల్లో సైతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ వేసవి శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. శిబిరాలు అందుబాటులో లేనివారు అంతర్జాల తరగతులను సద్వినియోగం చేసుకోవచ్చు.

రూబిక్ క్యూబ్‌తో మెదడుకు మేత..

'జులాయి' సినిమాలోని ఓ దృశ్యంలో హీరో అల్లు అర్జున్ రూబిక్ క్యూబ్‌ను క్షణాల్లో పరిష్కరిస్తాడు. అయితే మనం ఎంత ప్రయత్నించినా దాన్ని పరిష్కరించడానికి ఎంతో సమయం పడుతుంది. దీనిని పరిష్కరించడానికి ఎంతో ఏకాగ్రత కావాలి. ప్రస్తుతం ప్రతి జాతరలో, కిరాణం దుకాణంలో లభించే రూబిక్‌ను అందరూ కాలక్షేపానికి ఆడుతా రు కానీ..దీని వల్ల మెదడు ఉత్తేజ భరితం కావడంతో పాటు ఏకాగ్రత, ఓపిక, జ్ఞాపకశక్తి, ఐక్యూ స్థాయి సైతం పెరుగుతుంది. కేవలం నగరాలకే పరిమితమైన రూబిక్ క్యూబ్‌లో శిక్షణను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క మిర్యాలగూడలోనే లఘువరపు శిల్ప గత మూడేళ్లుగా వేసవి సెలవుల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. సుమారు 400



పైగా రకాలున్న రూబిక్ క్యూబ్‌లో 40 రకాల్లో తాను శిక్షణ ఇస్తున్నట్లు శిక్షకురాలు శిల్పకు తెలిపారు.

పిల్లల కోసం ఓ వనం..

సెలవుల్లో చిన్నారులు కేవలం ఆటలకే పరిమితం కాకుండా సాహిత్యం వైపు సైతం దృష్టి సారించాలని మిర్యాలగూడకు చెందిన సాహిత్య అభిమాని పొన్నూరు కిరణ్మయి సూచిస్తున్నారు. సాహితీవేత్తలైన తన స్నేహితుల సహకారంతో తన ఇంట్లోనే చిన్నారుల కోసం 'విస్మయి బాల వికాస వనం' పేరుతో సాహితీ కేంద్రాన్ని స్థాపించారు. ఇందులో చిన్నారుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. చిన్నారులు తమకు నచ్చిన కథల పుస్తకాలు, నవలలు చదవడంతో పాటు చిత్రాలు గీయవచ్చు. దీంతో పాటు క్యారమ్, చదరంగం వంటి ఆటలు సైతం ఆడవచ్చు. దీంతో పాటు చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వారితో కథలు రాయించడం, పాటలు పాడించడం, చిత్రలేఖన వంటి పోటీలు సైతం నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇటువంటి కేంద్రాలు లేని ప్రాంతాల వారు సైతం మంచి కథల పుస్తకాలను తీసుకొచ్చి ఈ సెలవుల్లో చిన్నారుల చేత చదివిస్తూ వారితో కథలు అలవాటు చేయించాలని కిరణ్మయి సూచిస్తున్నారు.

చదరంగంలో తర్ఫీదు..

అంతర్జాతీయంగా మంచి పేరున్న మెదడు ఆధారిత క్రీడల్లో చదరంగం మొదటిది. వేసవి సెలవుల్లో పలు పట్టణాల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు సైతం ఏర్పాటు చేస్తుంటారు. ఈ శిబిరాలు మే ఒకటో తారీఖు నుంచి ప్రారంభం కానున్నాయి. చిన్నారులను నెల రోజుల పాటు చదరంగంలో శిక్షణ ఇప్పించడం ద్వారా అనేక అద్భుతాలు జరుగుతాయని మిర్యాలగూడకు చెందిన చదరంగం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాశెట్టి శ్రీనివాస్ చెప్తున్నారు. చదరంగం నేర్చుకోవడం ద్వారా మేధస్సుతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి సైతం పెరుగుతాయని..జిల్లాలో అనేక మంది కొద్ది రోజుల శిక్షణ తోనే అనేక మంది చిన్నారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతున్నారన్నారు. వేసవి సెలవుల్లో చిన్నారులు ఏ క్రీడలో శిక్షణ పొందుతున్నప్పటికీ చదరంగంలోనూ శిక్షణ ఇప్పించాలని శ్రీనివాస్ సూచిస్తున్నారు.

# ఆధార్ నమోదు మూత.. జనాల వెత

యాదగిరిగుట్ట :యాదగిరిగుట్ట తహసీల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం కొన్ని రోజులుగా మూత వేయడం, సేవలు అందకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. నేటి కాలంలో ప్రతీదానికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. కొత్త కార్డులు, సవరణలు, చరవాణి సంఖ్య అనుసంధానం చేయడం, మార్పులు వగైరా పనుల కోసం ప్రభుత్వ అనుబంధ రంగ సంస్థల ద్వారా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐతే నమోదు కేంద్రం మూత ఉండటం, జనాలకు సేవలందక వెనుతిరిగి పోతున్నారు.



వృద్ధులు, పిల్లలు, తల్లులు, దివ్యాంగులకు చాలా ఇబ్బందిగా మారింది. ఎందుకు మూతబడి ఉన్నదనే విషయంపై తహసీల్దారు శోభన్‌బాబు, నిర్వాహకులను వివరణ కోరగా ఆ కేంద్రం ఐడీని ప్రభుత్వం బ్లాక్ చేసినట్లుగా తెలిసింది. సేవల్లో లోపాలు, పారదర్శకత లేకుంటే ఇలా ఐడీని బ్లాక్ చేస్తారని తెలిపారు. ఐతే కేంద్ర ప్రభుత్వమే ప్రభుత్వ సంస్థల ద్వారా ఈ సేవలందించడానికి కావాలని ఈ ఆధార్ నమోదు కేంద్రాలను బ్లాక్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినబడుతున్నాయి. దీనిపై నిర్వాహకులు ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే తపాలా కార్యాలయం, ఎస్‌బీఐ ద్వారా ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. చాలా మందికి తెలియక తికమకపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలపై ఏదో ఒక స్పష్టత నివ్వాలని, జనాలను ఇబ్బందులు పెట్టవద్దని కోరుతున్నారు.



# చంద్రబాబును చంపేస్తామని.. బాహాటంగా చెబుతున్నారు

రాజమహేంద్రవరం: తెదేపా అధినేత చంద్రబాబును జైలులో బంధించి ఇవాళ్టికి 50 రోజులైందని.. ఏ తప్పూ చేయకపోయినా వ్యక్తిగత కక్షతోనే ఆయనను అరెస్టు చేశారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. వ్యవస్థలను మేనేజ్ చేసి ప్రజల మధ్యకు చంద్రబాబును రానీయకుండా చేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జ్యుడిషియల్ రిమాండులో ఉన్న చంద్రబాబుతో భువనేశ్వరి, లోకేశ్ శనివారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వెలుపల మీడియాతో లోకేశ్ మాట్లాడారు. " రాష్ట్రంలో వ్యక్తిగత కక్ష సాధింపులు ప్రత్యక్షంగా చూస్తున్నాం. రాజకీయ ప్రత్యర్థులు ఓడిపోయేందుకు కష్టపడటం సహజమే. చంద్రబాబు చనిపోవాలి.. చంద్రబాబును చంపేస్తామని వైకాపా నేతలు బాహాటంగా చెబుతున్నారు. కేసుతో సంబంధం లేని నా తల్లిని కూడా జైలుకు పంపిస్తామని వైకాపాకు చెందిన మహిళా మంత్రి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' పేరుతో ప్రజల్లోకి నా తల్లి వెళ్తే ఆమెను కూడా అరెస్టు చేస్తామంటారా?

**మా ఆస్తులు ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధం :** 50 రోజులుగా చంద్రబాబును జైలులో ఉంచి ఏం సాధించారు. కొత్త ఆధారం ఒక్కటైనా ప్రజల ముందు పెట్టారా? స్కిల్, ఫైబర్‌నెట్ ఏ కేసులోనైనా కొత్త ఆధారాలు ఏమైనా చూపారా? పార్టీ ఖాతాకు డబ్బులు వచ్చాయని ఒక్క ఆధారమైనా చూపారా? ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ చేస్తున్నా. స్కిల్ కేసులో మా కుటుంబ సభ్యులు, మిత్రుల పాత్ర లేదు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయలేదు. మా ఆస్తులు, ఐటీ రిటర్న్‌లు ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నాం.

**సైకో జగన్‌ను వదిలిపెట్టం :** చంద్రబాబును బయటకు రానీయకుండా లాయర్ ఫీజుకు రూ.పదేసి కోట్లు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 32 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది.. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. రైతుల కోసం కాకుండా బస్సు యాత్ర పేరుతో గాలి యాత్ర చేస్తున్నారు. నిరుద్యోగ సమస్యతో యువత చాలా ఇబ్బంది పడుతోంది. వైకాపా నాయకుడికి దారి ఇవ్వలేదని బస్సును ఆపి డ్రైవర్‌పై దాడి చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దాడి చేసిన వారిపై ఇంతవరకు చర్యలు లేవు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. సైకో జగన్‌ను వదిలిపెట్టం.. ప్రజల తరఫున పోరాడుతాం" అని లోకేశ్ స్పష్టం చేశారు.



# కమ్మ వర్సెస్ కాపు- అంబటిపై దాడికి విజయవాడలో వైసీపీ నిరసనలు..

విజయవాడ : చంద్రబాబు అరెస్టు తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాల్లో ఆయన సతీమణి భువనేశ్వరి రాష్ట్రంలో చేస్తున్న పర్యటనలపై ఆగ్రహంతో వైసీపీ నేతలు ఆమెపై విమర్శలకు దిగుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణకు వెళ్లిన ఏపీ మంత్రి అంబటి రాంబాబుపై అక్కడి టీడీపీ నేతలు దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై వైసీపీ మండిపడుతోంది. అంతే కాదు దీన్ని కాపు సామాజికవర్గంపై కమ్మకుల దాడిగా అభివర్ణిస్తోంది. ఖమ్మంలో అంబటిపై దాడి చేసిన టీడీపీ నేతల్ని కమ్మ సామాజికవర్గంగా అభివర్ణిస్తూ ఈ దాడికి వ్యతిరేకంగా ఇవాళ విజయవాడలో వైసీపీ నిరసనలు చేపట్టింది. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో పాటు పలువురు వైసీపీ నాయకులు పోస్టర్లు పట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. వంగవీటి రంగా విగ్రహం వద్దకు వెళ్లి అంబటి రాంబాబు ఫొటోతో కాపు సామాజిక వర్గంపై కమ్మకుల దాడిని ఖండిస్తున్నట్లు ప్లకార్డులు ప్రదర్శించారు. మంత్రి అంబటిపై కమ్మ జాతి చేసిన దాడిని ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి వెలంపల్లి తెలిపారు. అలాగే అంబటిపై జరిగిన దాడిని పవన్ కళ్యాణ్ ఖండించాలని డిమాండ్ చేశారు. కాపులపై పవన్ కల్యాణ్ కి ప్రేమ లేదన్నారు.

కాపులపై దాడులు జరుగుతుంటే పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని వెలంపల్లి ప్రశ్నించారు. అంబటి రాంబాబుపై జరిగిన దాడిని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు సామాజిక వర్గం వారికి ఈ రాష్ట్రంలో దమ్ము లేక పక్క రాష్ట్రంలో తన సొంత పనిపై రాంబాబు వెళ్తే దాడి చేయడం హేయమన్నారు. కావాలనే దాడికి ప్రయత్నం చేశారన్నారు.
కాపుల ద్రోహి పవన్ కళ్యాణ్ అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందన్నారు. అంబటి పై జరిగిన దాడిని పవన్ కళ్యాణ్ ఖండించాలి లేకపోతే కాపుల ద్రోహిగా మిగిలిపోతాడు అని అన్నారు.

# వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం




విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో మూడో రోజు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర కొనసాగుతోంది. భీమిలో శనివారం బస్సు యాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, సీదిరి అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు, శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు. తగరపువలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. లోకేష్, భువనేశ్వరి సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయని విమర్శించారు. మత్స్యకారుల తోలు తీస్తానంటూ చంద్రబాబు బెదిరించారని మండిపడ్డారు. మత్స్యకారులను దూషించిన చంద్రబాబును ఎవరైనా మరిచిపోతారా అని ప్రశ్నించారు.

**చంద్రబాబు.. దొరికిన దొంగ :** చంద్రబాబు.. దొరికిన దొంగ అని, రాజమండ్రి సెంట్రల్ జైల్లో చిప్పకూడు తింటున్నాడని ధ్వజమెత్తారు. సైకిల్ పోవాలంటూ చంద్రబాబే స్వయంగా ప్రచారంలో చెప్పారని ప్రస్తావించారు. తాను నిప్పంటూ ఇన్నాళ్లు చెప్పిన చంద్రబాబు.. స్కీమ్‌ల పేరిట అన్ని స్కామ్‌లు చేసి జైల్లో ఉన్నారని దుయ్యబటారు. 'బాబు ముసలోడు అయిపోయాడు, ఆయన్ను బయటకు తేవాలంటున్నారు.

స్కీమ్‌ల పేరిట స్కామ్‌లు చేసిన చంద్రబాబును ప్రజలు నమ్ముతారా?. టీడీపీ నాయకుల్లో ఎవరికైనా దమ్ముంటే.. బాబు తప్పు చేయలేదని బెయిల్ అడగాలి. చట్టంలోని లొసుగుల గురించి మాట్లాడుతున్నారే గానీ.. చంద్రబాబు తప్పు చేయలేదని మాట్లాడటం లేదు' అని మంత్రి సీదిరి మండిపడ్డారు.

# ఏపీ ఎన్నికలకు చురుగ్గా ఈసీ ఏర్పాట్లు-మార్చిలో నోటిఫికేషన్.. !




అమరావతి : ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల ఎన్నికల బిజీలో ఉన్న కేంద్ర ఎన్నికల సంఘం.. వచ్చే నెలలో ఇవి పూర్తి కాగానే ఏపీతో పాటు మరికొన్ని రాష్ట్రాల ఎన్నికలకు రంగం సిద్దం చేస్తోంది. ఇప్పటికే ఏపీలో ఓటర్ల జాబితాల్ని సవరించి ముసాయిదాను నిన్న ప్రచురించిన ఎన్నికల సంఘం.. వీటిపై అభ్యంతరాలు స్వీకరించి డిసెంబర్ కల్లా పరిష్కారం చూపించనుంది. అనంతరం వచ్చే ఏడాది ఆరంభంలో ఏపీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయబోతోంది. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల దిశగా ఇప్పటికే ఈసీ వేగంగా అడుగులేస్తోంది. ముందు జమిలి ఎన్నికల నిర్వహణకు వీలుగా ఏర్పాట్లు చేసుకున్న ఈసీ.. అనంతరం కేంద్రం మందుకు రాకపోవడంతో అసెంబ్లీ గడువు ముగిశాక ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆగస్టులో ప్రారంభించిన ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే కొత్త ఓటర్ల నమోదు పూర్తి చేసిన ఎన్నికల సంఘం.. తాజాగా ముసాయిదా ఓటర్ల జాబితాను వెల్లడించింది. %జతీబఱంవతీ%: చెన్నై టూ సింగపూర్.. వయా వైజాగ్.! ఇప్పుడు వాటిలో అభ్యంతరాల్ని డిసెంబర్ వరకూ స్వీకరించి అనంతరం వాటిని పరిష్కరించనుంది. ఆ తర్వాత జనవరి మొదటివారంలోనే తుది ఓటర్ల జాబితాను ప్రచురించబోతోంది. దీని ఆధారంగా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఏపీ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సిద్దమవుతోంది. ఇదే క్రమంలో వచ్చే ఏడాది మార్చిలో ఏపీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని ఏపీ ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తాజాగా సంకేతం ఇచ్చారు. ఈ లెక్కన మార్చిలో ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తే ఏప్రిల్ లోనే ఎన్నికలు ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కూడా కేవలం షెడ్యూల్ ప్రకటించిన నెల రోజుల్లోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో ఏపీలోనూ షెడ్యూల్ ప్రకటన తర్వాత నెల రోజుల వ్యవధిలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఈసీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

# ఏపీ ఆర్థిక పరిస్థితిపై యనమల ఆందోళన.. బుగ్గనకు లేఖ



అమరావతి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. ఏపీ ఆర్థిక పరిస్థితిపై ఆర్థిక శాఖ ఉన్నతాధికారి రావత్‌కు లేఖ రాసినా వివరాలివ్వకపోవడంతో మంత్రి బుగ్గనకు యనమల లెటర్ రాశారు. మండలి ప్రతిపక్ష నేతగా తాను అడిగిన వివరాలు ఇవ్వాలని బుగ్గనను కోరారు. 2021-22 ఏడాదికి కాగ్ ఇచ్చిన నివేదికని లేఖలో ప్రస్తావించారు. 67 ప్రభుత్వ రంగ సంస్థలు ఆడిట్ సంస్థకు లెక్కలివ్వకపోవడంపై యనమల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఏపీ ఆర్థిక వ్యవస్థపై 2021-22 సంవత్సరానికి కాగ్ ఇచ్చిన నివేదిక ఏపీ ఆర్థిక దుస్థితికి అద్దం పడుతోంది. కాగ్ నివేదిక ఆందోళన కలిగిస్తోంది.. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తోంది. ఐదేళ్లల్లో మేం 1.39 లక్షల కోట్ల మేర అప్పు చేస్తే నాడు ప్రతిపక్ష నేతగా జగన్ చాలా ఆందోళన చెందారు. జగన్ సీఎం అయ్యాక మూడేళ్లల్లోనే మూడింతల మేర రూ. 3.25 లక్షల కోట్ల అప్పు చేశారు. ఏపీలో 97 పబ్లిక్ సెక్టార్ సంస్థలుంటే.. 30 సంస్థల ఆడిట్ లెక్కలే చూపాయని కాగ్ స్వయంగా చెప్పింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి రాష్ట్ర అప్పుల వాస్తవ పరిస్థితి తెలియ చేయాలి. ఉద్యోగస్తులు, కాంట్రాక్టర్లు, విద్యుత్ సంస్థలకున్న బకాయిల వివరాలివ్వాలి. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధుల ఖర్చు లెక్కలు అందించాలి" అంటూ యనమల లేఖలో కోరారు.

# మొన్న టమాటా... నేడు ఉల్లిబీ కొండెక్కుతున్న ఆనియన్ ధరలు..!!


ఆ మధ్య టమాటా ధరలు చుక్కలను తాకి సామాన్యులకు షాక్ ఇస్తే, ఇప్పుడు ఉల్లి ధరలు సామాన్యుల కళ్ళవెంట నీళ్లను తెప్పిస్తున్నాయి. ఉల్లిపాయల ధర పెరిగితే మన వంటింట్లో బడ్జెట్ పెరగడం ఖాయం.. ఈ విషయం ఎవరు కాదనలేని సత్యం. అటువంటి ఉల్లి ధరలు ఇప్పుడు చుక్కల్ని తాకుతున్నాయి. హైదరాబాద్లో కేజీ ఉల్లిపాయలు 70 రూపాయలకు విక్రయిస్తున్నారు అంటే ధరలు పెరుగుతాయి అన్న ఆందోళన వ్యక్తం అవుతుంది. మొన్నటి వరకు టమాటాలు కిలో 200 రూపాయలు పలకగా, ఇప్పుడిప్పుడే కాస్త టమాటాల ధరలు తగ్గాయి కానీ, ఇప్పుడు నిదానంగా ఉల్లిపాయల ధరలు పెరుగుతున్నాయి. ఇక దీపావళి పండుగ సీజన్ కావడంతో ముందు ముందు మరింత ధరలు పెరుగుతాయన్న అంచనాలు కనిపిస్తున్నాయి. దేశంలోని అతి పెద్ద ఉల్లి మార్కెట్ అయిన మహారాష్ట్ర మరియు కర్ణాటక రాష్ట్రాలలో కురిసిన భారీ వర్షాల దెబ్బకు ఉల్లి పంట బాగా దెబ్బతింది. దీనివల్ల మార్కెట్లో ఉల్లి కొరత కనిపిస్తుంది. డిమాండ్ కు తగ్గట్టుగా సప్లై లేకపోవడంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక బెంగళూరులో ఉల్లి ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఈ సంవత్సరం ఉల్లి పంటకు అకాల వర్షాలు, అనావృష్టి రెండు దెబ్బ తీయడంతో ధరల పెరుగుదల కనిపిస్తుంది ఇటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో



వర్షాలు సరిగా పడకపోవడంతో కర్నూలు, మహబూబ్ నగర్, సంగారెడ్డి, మెదక్, చేవెళ్లలో పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఇక ఈ పరిస్థితులతో ప్రస్తుతం ఉల్లి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీపావళి పండుగ సమయానికి ఉల్లి ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం అవుతుంది. మరి నవంబర్ రెండవ వారానికి ఖరీఫ్ పంట అందుబాటులోకి రానుండడంతో మళ్లీ ఉల్లి ధరలు తగ్గే అవకాశం ఉన్నట్టు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా వంటింట్లో నిత్యావసరమైన ఉల్లి ధరలపై నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని, ఆ చర్యలను తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు సామాన్య మధ్య తరగతి ప్రజలు.

# ఏపీ ప్రభుత్వం కేంద్రం చేతిలో కీలుబొమ్మలా తయారయ్యింది

ఢిల్లీ: ఏపీ ప్రభుత్వం కేంద్రం చేతిలో కీలుబొమ్మలా తయారయ్యిందని సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. శనివారం నాడు సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..."అక్టోబర్ 30 తేదీ నుంచి ఏపీలో సీపీఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో సీపీఎం రాజకీయ విధానాన్ని ప్రజలకు చెప్పడం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అంశాలను ప్రజలకు చెప్పే కార్యాచరణతో ప్రజా రక్షణ భేరి కార్యచరణ ఉంటుంది. కర్నూలు జిల్లా ఆదోని, శ్రీకాకుళం జిల్లా ముందస, పార్వతీపురం జిల్లా సీతం పేట నుంచి విజయవాడ వరకు బస్సు జాతాలు జరగనున్నాయి. నవంబర్ 15 తేదీ విజయవాడలో ప్రజా రక్షణ భేరి సభ నిర్వహిస్తాం. విజయవాడ సభకు సీతారాం ఏచూరి, రాఘవులు హాజరుకానున్నారు. వామపక్ష పార్టీలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం. 10 సంవత్సరాల్లో కేంద్రం ఏపీకి సంబంధించిన ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదు. ప్రత్యేక హామీలు, విశాఖ, కడప ఉక్కు పరిశ్రమల అంశాలను కేంద్రం పట్టించుకోలేదు. ఏపీకి కేంద్రం తీరని అన్యాయం చేస్తుంది. కేంద్రం అన్యాయం చేస్తుంటే రాష్ట్రంలో రాజకీయపార్టీలు మాట్లాడకపోవడం దురదృష్టకరం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎందుకు ఎన్డీఏలో ఉన్నాడో చెప్పాలి. ఏపీకి ఏం చేసింది అని ఇంకా ఎన్డీఏలో పవన్ కళ్యాణ్ ఉంటున్నారు. బీజేపీ ఎన్డీఏను ఎందుకు పవన్ కళ్యాణ్ మోస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని బీజేపీతో ఎందుకు చేతులు కలుపుతున్నారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపడతారా బీజేపీ ముందు మోకరిల్లుతారా తేల్చుకోవాలి. అవినీతిని నిర్మూలించాలన్న ఆలోచన చిత్తశుద్ధి కేంద్రానికి లేదు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండించాం. కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ విషయంలో నాటకం ఆడుతుంది. బీజేపీ వల్ల ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయి. బీజేపీని ఆదర్శంగా తీసుకుని వైసీపీ హక్కులను హరిస్తుంది. వైసీపీ సామాజిక న్యాయం పాటించడం లేదు. ఏపీలో దళితులపై దాడులు జరుగుతున్నాయి. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు" అని వి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ప్రతీకారం తీర్చుకొన్న అమెరికా..!

## సిరియాలోని ఇరాన్ దళాల స్థావరాలపై దాడి..!

ఇరాక్, సిరియాలోని తమ స్థావరాలపై గత కొన్ని రోజుల్లో జరిగిన 12 దాడులకు అమెరికా ప్రతీకారం తీర్చుకుంది. ఇందుకోసం తూర్పు సిరియాలోని ఇరాన్ మద్దతున్న సాయుధ బలగాలపై గగనతల దాడులు నిర్వహించింది. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ నేడు ప్రకటించారు. అధ్యక్షుడు జోబైడెన్ ఆదేశాల మేరకే ఈ దాడులు చేసినట్లు వెల్లడించారు. తాము దాడి చేసిన ప్రదేశాలను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ వాడుతోందని చెప్పారు. ప్రస్తుతం గాజాలో జరుగుతున్న సంక్షోభానికి ఈ దాడులకు సంబంధం లేదని లాయిడ్ ఆస్టిన్ వివరణ ఇచ్చారు. అమెరికా దళాలపై దాడులను ఏమాత్రం సహించబోమని తెలియజేసేందుకే ఈ చర్యను చేపట్టినట్లు చెప్పారు. అమెరికా దళాలపై జరుగుతున్న దాడుల వెనుక ఇరాన్ హస్తం ఉందని.. వాటిని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గతంలో కూడా బైడెన్ ఆదేశాల మేరకు పశ్చిమాసియాలోని సాయుధ మూకలపై అమెరికా దాడులు చేసింది. కానీ, ఈ సారి మాత్రం ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనడంతో ఇరాన్‌కు బలమైన హెచ్చరిక జారీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకొంది. అక్టోబర్ 17 నుంచి అమెరికా దళాలపై 12 దాడులు జరిగాయి. ఈ దాడుల్లో కొందరు సైనికులు గాయపడ్డారు. ఓ మిలటరీ కాంట్రాక్టరు గుండెపోటుతో మరణించారు. మరో 900 మంది సైనికులను పశ్చిమాసియాలో మోహరిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో రెండు విమాన వాహక నౌకలను మోహరించింది. బుధవారం నాడు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మాట్లాడుతూ.. ఇరాన్ పాలకుడికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికా దళాలకు ఎదురొస్తే.. తగిన రీతిలో స్పందిస్తామని.. అందుకు సిద్ధంగా ఉండాలని అయాతుల్లాను హెచ్చరిస్తున్నా" అని పేర్కొన్నారు. అమెరికాకు ఆత్మరక్షణ హక్కు ఎప్పుడూ ఉంటుందని పెంటగాన్ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ పాట్ రైడర్ పేర్కొన్నారు. డ్రోన్లతోనా.. రాకెట్లతోనా.. ఎప్పుడు ఎలా దాడి చేయాలనేది అమెరికా నిర్ణయిస్తుందని వెల్లడించారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

అనంతపురం: సంస్కృత భాషలో ఆదికవి, శ్రీరాముని చరితను రసరమ్యంగా లిఖించి రామాయణాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతి సందర్భంగా రాష్ట్ర పండుగగా జరుపుకోవడం సంతోషదాయకమని మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. సోమందేపల్లిలో మహర్షి వాల్మీకి జయంతి ని పురస్కరించుకుని వాల్మీకి విగ్రహానికి శంకర్ నారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# 'తీన్ మార్' బ్యూటీ వెడ్డింగ్ ఎఫైర్

టాలీవుడ్ లో బోణీ– తీన్ మార్ లాంటి చిత్రాల్లో నటించింది కృతి కర్భందా. కానీ ఆశించిన సక్సెస్ దక్కలేదు. బాలీవుడ్ లోను అంతంత మాత్రమే. తర్వాత గెస్ట్ ఇన్ లండన్– షాదీ మే జరూర్ ఆనా – పాగల్ పంథి వంటి కొన్ని చిత్రాలలో నటించింది. అయితే కృతి కొంత గ్యాప్ తర్వాత కెరీర్ పరంగా చెప్పుకోదగ్గ అవకాశాల్ని అందుకుంది. హిందీ పరిశ్రమ నుంచి కొన్ని క్రేజీ ఆఫర్లు తనని వరించాయి. ఇక కృతి వరుస ఫోటోషూట్లు ఇటీవల అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. పాపులర్ వెడ్డింగ్ ఎఫైర్ మ్యాగజైన్ కవర్




షూట్ లో పాల్గొన్న కృతి చీరలో ఎంతో అందంగా కనిపించింది. ట్రెడిషనల్ గా కనిపిస్తూనే వేడెక్కించే ఒంపు సొంపులను తెరనిండుగా ఆవిష్కరించింది ఈ బ్యూటీ. దీనిపై అభిమానుల నుంచి ఆసక్తికర కామెంట్లు వచ్చి పడుతున్నాయ్. బులుగు జిలుగు చీరపై అంబ్రాయిడరీ వర్క్ ఎంతో ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవల నవతరం హీరోల సరసన నటించేందుకు సంతకాలు చేసిన కృతి తన ప్రాజెక్టుల గురించి ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ తో కలిసి పనిచేయాలన్న తన కోరిక మాత్రం ఇప్పట్లో నెరవేరేట్టు లేదు.

ఎదిగే క్రమంలో షారుఖ్ ఖాన్ ను నేను ఎక్కువగా అభిమానించే వీరాభిమానిని అని, కచ్ లో ఉన్నపుడు పాఠశాల స్టడీస్ లో ఉన్న రోజుల్లోనే, కుచ్ కుచ్ హోతా హై ప్రభావం తనపై తీవ్రంగా ఉందని తెలిపింది. మాది సినిమా హాళ్లలో సినిమాలు చూడటానికి ఆదివారాలను అంకితం చేసే కుటుంబం... అని కూడా పేర్కొంది.. కృతి చివరిగా 14 ఫేరేలో విక్రాంత్ మాస్సేతో కలిసి కనిపించింది. తదుపరి సినిమాని ప్రకటించాల్సి ఉంది.

## అప్పుడు రాణీ వయసు 17 కాదు..మరెంతో తెలుసా?

25 లో చేయాల్సిన పనులు 16..17 ఏళ్ల వయసులో చేస్తే అలాగే ఉంటుంది. అప్పుడు మమ్మీ అయి ఆ తర్వాత మమ్మీ కాదంటే? ఎలా! ఇలాగే రకరకాల సందేహాలు వచ్చేస్తాయి. ఇంకా నయం అప్పుడు సోషల్ మీడియా లేదు కాబట్టి సరిపోయింది. లేదంటే నీ పరిస్థితి ఏంటి అమ్మడు. 17 ఏళ్లు అయినా 34 చేసి నలుగురు పిల్లల తల్లివి కూడా అయిపోయేదానివి. అవును ఇదంతా ఎవర్ని ఉద్దేశించి అనుకుంటున్నారా? ఆమె ఎవరో కాదు..బాలీవుడ్ అందం రాణీముఖర్జీ. బెంగాలీ సినిమాతో బాలీవుడ కి ఎంట్రీ ఇచ్చిన రాణీముఖర్జీ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో హిందీ సినిమాల్లో నటించి నటిగా తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచుకుంది. అటుపై ఆదిత్య చోప్రాని వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడింది. అలాగని రిలాక్స్ అవ్వలేదు. వృత్తి పరంగా కొనసాగుతూనే ఉంది. తాజాగా అమ్మడు కెరీర్ తొలి దశని తలుచుకుని ఆనాటి మురిసిపోయింది. కరణ్ జోహార్ తెరకెక్కించిన 'కుచ్ కుచ్



హోతా హై' సినిమాలో రాణీ ముఖర్జీ ఓ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ పాత్ర గురించి రాణీ ఇలా వ్యాఖ్యానించింది. 'నా కెరీర్ లో అత్యంత సవాల్ తో కూడుకున్న పాత్ర ఏదైనా ఉంది అంటే కుచ్ కుచ్ హెతా హైలో అమ్మగా నటించడం. లక్కీగా నా పాత్ర నిడివి ఎక్కువగా లేకపోవడంతో బ్రతికిపోయాను' అంది. దీనిపై నెటి జనులు రాణీ ముఖర్జీని ఆడుకోవడం మొదలు పెట్టారు. అప్పుడు రాణి వయసు 17 కాదు..20 అని ఒకరు..కాదు కాదు అంతకు మించి అని మరికొంత మంది కామెంట్లు పెట్టారు. ఆమె కనిపించింది ఒకట్రెండు సన్నివేశాల్లోనే. అదీ పాపగా ఏదో బొమ్మని పట్టుకుని ఉంటుంది అని మరోకరు కామెంట్లు పెట్టారు. మరి నిజంగా వయసు తక్కువైనప్పుడు 25 ఏళ్లలో చేయాల్సిన పనులు 17 ఏళ్లకే చేయడం దేనికి? అంత నామోషీగా ఉంటే ఆ పాత్ర పోషించడం మానేయాలి. అంతేకానీ అమ్మ పాత్రని అవమానించేలా మాట్లాడవద్దు అంటూ మరికొంత మంది మండిపడ్డారు.




# 4కోట్లతో రేంజ్ రోవర్ కార్ కొన్న హీరోయిన్




హాట్ గాళ్ పూజా హెగ్డే ప్రస్తుతం ముంబై సర్కిల్స్ లో హల్ చల్ చేస్తోంది. ఇటీవల బాలీవుడ్ పై పూర్తిగా కాన్ సన్ ట్రేట్ చేసిన పూజా ఈ దసరాకి అదిరిపోయే సెల్ఫ్ గిఫ్ట్ ఇచ్చుకుంది. ఇటీవల సిల్వర్ రేంజ్ రోవర్ ఎస్‌యువిని కొనుగోలు చేసింది. దీని విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని సమాచారం. మీడియా కథనాల ప్రకారం.. ఈ కారు హై ఎండ్ లో లుక్ ఎంతో అద్భుతంగా ఉంది. వాహన గరిష్ట వేగ పరిమితి గంటకు 234 కి.మీ. 3.0–లీటర్ 6–సిలిండర్ ఇంజెనియం పెట్రోల్ ఇంజన్‌తో డిజైన్ చేసినది. ఇందులో 294 %ఎెఔ% మోటార్‌తో కలిపి 404.5 KW శక్తిని అందిస్తుంది. ఈ వాహనం 13.1–అంగుళాల ఫ్లోటింగ్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, సౌకర్యవంతమైన హెడ్–అప్ డిస్‌ప్లే, మల్టీ–జోన్ క్లైమేట్ కంట్రోల్, ఫోర్–స్పోక్ స్టీరింగ్ వీల్ .. ఎంటర్ టైనింగ్ బ్యాక్ సీటు స్క్రీన్ వంటి ఆకట్టుకునే ఫీచర్లతో వస్తుంది. రేంజ్ రోవర్ ఇప్పుడు లాంగ్ వీల్‌బేస్ వెర్షన్‌తో ప్రత్యేకంగా అందుబాటులో ఉండే మూడవ–వరుస సీటును కలిగి ఉంది. రకరకాల రంగుల్లో ఈ కార్ అందుబాటులో ఉంది. ఇది పెట్రోల్ వెర్షనా డీజల్ వెర్షనా అన్నది తెలియాల్సి ఉంది. ఈ కార్ సిల్వర్ రంగులో ఉంది. ఈ అద్భుతమైన రేంజ్ రోవర్ SUV తన గ్యారేజ్ లో రాజును తలపిస్తుందనడంలో సందేహం లేదు. పూజా హెగ్డే గ్యారేజ్ లో ఇప్పటికే పలు ఖరీదైన కార్లు ఉన్నాయి. ఆడి క్యూ7, జాగ్వార్ సెడాన్, పోర్ష్చే కయెన్ , బిఎమ్‌డబ్ల్యూ 5–సిరీస్ సెడాన్ సహా ఇతర హై–ఎండ్ కార్లను కలిగి ఉంది. సందర్భాన్ని బట్టి పూజా తన ప్రయాణానికి కార్ లను ఎంపిక చేస్తుంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. పూజా ఇటీవల టాలీవుడ్ నుంచి దూరమైనా కానీ, బాలీవుడ్ లో వరుస చిత్రాలు చేస్తోంది. ప్రస్తుతం షాహిద్ కపూర్ సరసన ఓ చిత్రం చేస్తోంది. అధికారికంగా దీనిని ప్రకటించారు. పూజా హెగ్డే బర్త్ డే సందర్భంగా టీమ్ పూజాకు గ్రాండ్ వెల్ కం చెప్పింది.

# ప్రభాస్‌లానే లంబోర్ఘిణి యజమాని




లగ్జరీ బ్రాండ్ కార్లను ఛేజిక్కించుకోవడంలో సినీసెలబ్రిటీలు ఎప్పుడూ ముందుంటారు. ఇంతకుముందే డార్లింగ్ ప్రభాస్ అల్ట్రా రిచ్ విదేశీ కార్ లంబోర్ఘిణికి యజమాని అయ్యాడు. టాలీవుడ్, బాలీవుడ్ లో ఇప్పుడు పలువురికి లంబోర్ఘిణి సొంతమైంది. ఇప్పుడు ఈ జాబితాలోకి సాహో బ్యూటీ శ్రద్ధా కపూర్ పేరు చేరింది. శ్రద్ధా కపూర్ లంబోర్ఘిని హురాకాన్ టెక్నికాను రూ. 4 కోట్లకు కొనుగోలు చేసింది.

దసరా ముహూర్తాన కొత్త కార్ తన ఇంటికి వచ్చింది. లంబోర్ఘిణి కొత్త బ్రాండ్ టెక్నికా ఆగస్టు 2022 నుంచి భారతదేశంలో అందుబాటులో ఉంది. దీనిని పలువురు సెలబ్రిటీలు సొంతం చేసుకున్నా మహిళా సెలబ్రిటీల్లో ఇదే మొదటిసారి. మరోవైపు 'స్త్రీ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్న శ్రద్ధా కపూర్ దసరా సెలవులను కుటుంబంతో కలిసి ఆస్వాధించింది. ఇప్పుడు ఖరీదైన కార్ ని కొనుగోలు చేసిన ఆనందం తనలో ఆవర్ణమైంది. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేనని తెలిపింది. "ఈ రోజు నాకు నిజంగా ప్రత్యేకమైన క్షణం!' అంటూ శ్రద్ధా ఆనందం వ్యక్తం చేసింది. ఇది ముంబైలో మరపురాని మొదటిది – ఒక లంబోర్ఘిని అద్భుతమైన స్త్రీకి దక్కింది" అని శ్రద్ధా కపూర్ స్నేహితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫోటోను షేర్ చేసింది. సూపర్ కార్ ఎప్పుడూ కారు మాత్రమే కాదు – ఇది అడ్డంకులను తొలగించి మీ కలలను నిర్భయంగా కొనసాగించడానికి ప్రతీక.. అని తన స్నేహితురాలు పేర్కొంది. దీనిపై శ్రద్ధా కపూర్ స్పందిస్తూ, "మంచి మాటలకు చాలా ధన్యవాదాలు.... అంటే అత్యంత స్ఫూర్తిదాయకమైన బాస్ ఉమెన్ నుండి వస్తోంది!!! గర్ల్ పవర్ అన్ని విధాలా"అని వ్యాఖ్యను జోడించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... శ్రద్ధా కపూర్ మడాక్ ఫిల్మ్స్‌తో కలిసి స్త్రీ 2 కోసం పని చేస్తోంది. చివరిగా తూ ఝూతీ మెయిన్ మక్కార్‌లో కనిపించిన ఈ భామ వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది.

# తడిచిన అందాలతో వింక్ బ్యూటీ హొయలు..!

ఒకప్పటి నేషనల్ క్రష్ ప్రియా ప్రకాశ్ వారియర్. ఈ బ్యూటీ కేవలం ఒక్క వీడియోతో పాపులర్ అయిపోయింది. ఓ మూవీలో ఈ బ్యూటీ కన్ను కొట్టిన వీడియో వైరల్ గా మారడంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. దీంతో, ఆమెకు సోషల్ మీడియాలో క్రేజ్ బాగా పెరిగిపోయింది. ఈ క్రేజ్ తోనే ఆమెకు సినిమాల్లో ఆఫర్లు క్యూ కట్టాయి. అయితే, సరిగా కథలను ఎంచుకోకపోవడంతో ఒక్కసారిగా బోల్తా పడిపోయింది. మూవీల్లో వరసగా ఛాన్సులు రాకపోయినా, ఆమె సోషల్ మీడియాలో మాత్రం అదరగొడుతూ ఉంటుంది. ఎప్పటికప్పుడు ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా పసుపు



రంగు డ్రెస్ లో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. సముద్రం నీటిలో తడుస్తూ, తన అందాలతో మరింత కనువిందు చేసింది. పసుపు రంగు బికినీతో ట్రీట్ ఇచ్చింది. నీటిలో తడవడంతో ఆమె అందాలు మరింత స్పష్టంగా కనపడుతున్నాయి. తన నడుము దగ్గర నుంచి, థైస్ అందాలను కూడా ఆరబోసింది. అంతేకాదు, క్లీవేజ్ షోతో మెస్మరైజ్ చేసింది. ఆమె ఫోటోలకు ఇప్పుడు నెటిజన్లు మెస్మరైజ్ అయిపోతారు. హాట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, కొన్ని ఫోటోల్లో ఆమెతో పాటు ఆమె ఫ్రెండ్స్ కూడా ఉన్నారు. వారు కూడా క్లీవేజ్ షో చేయడం గమనార్హం. ఇక ప్రియా వారియర్ తెలుగులో రెండు చిత్రాల్లో నటించింది. ముందు నితిన్ సరసన 'చెక్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత యంగ్ హీరో తేజ సజ్జ సరసన 'ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీ'లో నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు ప్రియాకు సక్సెస్ ను అందించలేకపోయాయి. కాగా, తెలుగు, తమిళంలోనూ నటించింది. కాగా, ఇప్పుడు తెలుగులోకి బ్రో చిత్రంతో రీఎంట్రీ ఇస్తుంది. పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ హీరోలుగా ఈ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 28న విడుదల కానుంది. ఇందులో హీరోని ప్రేమించే అమ్మాయి పాత్రలో కనిపిస్తుందని సమాచారం. మూవీ విడుదల అయితే కానీ, క్లారిటీ రాదు.

## బార్బీ బొమ్మకి చెల్లెలివా.. శ్రీముఖి క్యూట్ ఫోజులు..!

బుల్లితెర హాట్ బ్యూటీల్లో శ్రీముఖి ఒకరు. మంచి అవకాశాలు రాక యాంకర్ గా ఫిక్స్ అయిపోయింది కానీ, హీరోయిన్ కి ఏ మాత్రం తీసిపోదు మన బుల్లితెర రాములమ్మ. మోడ్రన్ లుక్ నుంచి ట్రెండీ లుక్ వరకు ఏ దుస్తుల్లోనైనా మెస్మరైజ్ చేయగల సత్తా శ్రీముఖికి సొంతం. అవతల పక్క ఎంత పెద్ద సెలబ్రెటీలు ఉన్నా, ఏ మాత్రం తడపడకుండా, ధీటుగా నిలపడి సమాధానం చెప్పగలదు. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. టీవీ షో లో కనిపించే దుస్తులతో ఫోటో షూట్ లు చేసి షేర్ చేస్తూ ఉంటుంది. అంతేకాదు, తన ఫ్రెండ్స్, ఫ్యామిలీతో ట్రిప్స్ కి వెళ్లినప్పుడు కూడా తన అందాన్ని కెమేరాల్లో బంధించి, ఆ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇక శ్రీముఖి పొట్టి



దుస్తులు ధరించానికి, క్లీవేజ్ షో చేయడానికి కూడా ఏ మాత్రం వెనకాడదు. ప్రోగ్రామ్ కి తగినట్లు దుస్తులు ధరిస్తూ ఉంటుంది. ప్రస్తుతం స్టార్ మాలో రెండు ముఖ్యమైన ప్రోగ్రామ్స్ కి యాంకర్ గా చేస్తోంది. కాగా, తాజాగా ఈ హాట్ బ్యూటీ కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అందులో పొట్టి గౌను వేసుకొని క్యూట్ ఫోజులు ఇచ్చింది. అచ్చం బార్బీ బొమ్మలా కనిపించడం విశేషం. లావెండర్ కలర్ ఫ్రాక్ పై గోల్డ్ కలర్ ప్రింట్ చాలా అందంగా ఉంది. డ్రెస్ కి తగినట్లు మేకప్ వేసుకుంది. బుట్ట చేతుల గౌనులో శ్రీముఖి ని చూసి ఫ్యాన్స్ సూపర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా.శ్రీముఖి యాంకరింగ్ కెరీర్ ని ఎంచుకొని చాలా కాలం అవుతోంది. ఆమెను మొదటి సారి చూసినప్పుడే అందరూ ఆమె అందానికి ఫిదా అయిపోయారు. ఇప్పటి వరకు చాలా టీవీ షోలో వ్యాఖ్యతగా వ్యవహరించింది. తన కెరీర్ ని మొదలుపెట్టినప్పటి నుంచి ఆమె మళ్లీ వెనక్కి తిరిగి చూసుకుంది లేదు. మధ్యలో కొన్ని సినిమాల్లోనూ నటించింది కానీ, పెద్దగా వర్కౌట్ కాలేదు. కాగా, తాజాగా మెగాస్టార్ చిరంజీవితో కలిసి భోళా శంకర్ మూవీలో నటించింది.




# బీఆర్ఎస్‌లో అలకల మెలికలు షురూ..!

## ఎన్నికల వేళ తలనొప్పిగా మారుతున్న నేతల తీరు

హైదరాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా పార్టీల్లో నేతల అలకలు ఎమ్మెల్యే అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. ఇన్ని రోజుల పాటు పార్టీలో చురుకుగా పని చేసిన నేతలు ఒక్కసారిగా అలకలబూనడంతో ఎమ్మెల్యే అభ్యర్థులకు చుక్కలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు సిద్దంకి కృష్ణారెడ్డి కొన్ని రోజులుగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై అలకభూనారు. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు. ఈ నెల 22న పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి పాల్గొన్న మున్సిపల్ బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి కూడా హాజరుకాలేదు. మరుసటి రోజు కృష్ణారెడ్డిని ఎమ్మెల్యే పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది. అయినా, కృష్ణారెడ్డి మాత్రం తన సమస్యలను పరిష్కరిస్తే ఆలోచిస్తానంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో కృష్ణారెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరబోతున్నట్లు పెద్దఅంబర్‌పేట్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

ఇక మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి సైతం కొంత కాలంగా పార్టీలో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆమె కూడా బూత్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరుకాకపోవడంతో హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని బాటసింగారం గ్రామానికి చెందిన సీనియర్ నేత నోముల జగదీశ్వర్‌నేత ఏడాది కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నాడు. పలుమార్లు ఆయనతో చర్చలు జరిపినా ఫలించలేదని తెలిసింది. ఎన్నికల సమయంలో ముఖ్య నేతల అలక పాన్పు ఎక్కడంతో వారిని ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. వారు దిగి వస్తారో లేక పార్టీకి గుడ్‌బై చెబుతారో వేచిచూడాలి.




ఉట్నూర్: మోసం.. దగాకు మారు పేరు కాంగ్రెస్ అని, ఆ పార్టీని నమ్మి ఓటేస్తే ఆగం అవుతామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వస్తే గిరిజన తండాలు, గూడేలను గ్రామపంచాయతీలుగా మారుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేస్తే.. వాటిని నెరవేర్చింది మాత్రం కేసీఆర్ ప్రభుత్వమని గుర్తు చేశారు. కేసీఆర్ అంటేనే ఒక నమ్మకం అని పేర్కొన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఏజెన్సీలోని గిరిజన రైతులను ఆదుకున్నామన్నారు. రైతు బీమా మాదిరిగానే.. భూమిలేని పేదలకు రూ.5లక్షల బీమా వర్తింప చేస్తామన్నారు. రైతులకు 3గంటల విద్యుత్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నారన్నారు. 3గంటల కరెంట్ కావాల్సిన వాళ్లు కాంగ్రెస్‌కు.. 24 గంటల ఉచిత కరెంటు కావాలనుకునే వాళ్లు భారాసకు ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ పాలించే కర్ణాటకలో, భాజపా పాలించే మహారాష్ట్రలో రైతులకు 24గంటల కరెంటు ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో ఆదిలాబాద్ అభివృద్ధి ఖిల్లాగా మారిందన్నారు. భారాస మేనిఫెస్టోను గడప గడపకూ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పదేళ్ల నుంచి రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తోందని.. ఈ పదేళ్లలో కరవు లేదు.. కర్ఫ్యూ లేదన్నారు. గతంలో ప్రభుత్వాలు రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవని, ఇప్పుడు కరెంటు బిల్లు లేదు, నీటి తీరువా బిల్లు చెల్లించాల్సిన పనిలేదని చెప్పారు. ఈ దేశంలో రైతులకు డబ్బులిచ్చిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. మళ్లీ భారాస గెలిస్తే ఎకరాకు రూ.16వేలు చొప్పున రైతు బంధు ఇస్తామన్నారు.

ఏటా 10వేల మంది వైద్యులను దేశానికి తెలంగాణ అందిస్తోందని, ఐటీ ఉద్యోగాల కల్పనలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని మంత్రి హరీశ్‌రావు వివరించారు. మళ్లీ భారాస ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. డిసెంబరు 30న కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

## అర్రాజ్ పాటలా విపక్షాల హామీలు.. సీఎం కేసీఆర్‌పైనే ప్రజలకు నమ్మకం: మంత్రి కేటీఆర్




హైదరాబాద్: భారత దేశానికి తెలంగాణ దిక్సూచి అయిందని మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ పాలన సాధించిన ఘనత ఇదన్నారు. నేడు తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో సమగ్ర, సమతుల్య, సమ్మిళిత, సమీకృత అభివృద్ధి కొనసాగుతున్నదని వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. 2014లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.లక్షా 14 వేలుగా ఉందని, ప్రస్తుతం అది రూ.3లక్షల 17 వేలకు పెరిగిందన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు ఎలాంటి వివక్ష, కులమత భేదాలు లేకుండా జీవిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగమన్నారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందని చెప్పారు. అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పులపాటు చేశారన్న ఆరోపణలు సరికాదన్నారు. అప్పులు చేసిన నిధులు సంపద సృష్టికి ఉపయోగిస్తున్నామని చెప్పారు. రుణాలు మొత్తం సాగునీటి రంగం, మిషన్ భగీరథకు వినియోగించామన్నారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందిస్తున్నామని వెల్లడించారు. విద్యుత్ రంగంలో సంస్కరణల కోసం రుణాలు తెచ్చారని చెప్పారు. తద్వారా స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచామన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యం సాధించామని తెలిపారు. అటు పల్లెలు, ఇటు పట్టణాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి జాతీయ అవార్డుల్లో తెలంగాణకే సింహభాగం దక్కాయని చెప్పారు. 7.7 శాతం గ్రీన్ కవర్ పెంచడం దేశంలోనే అద్భుతమన్ని వెల్లడించారు. ఐటీ రంగంలో బెంగళూరును హైదరాబాద్ దాటేసిందని చెప్పారు. ఐటీ ఎగుమతులు 400 శాతం పెరిగాయని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. దేశానికి అన్నపూర్ణగా ఎదిగిందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది శూన్యమని విమర్శించారు.

## ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చిన పార్టీకే మా మద్దతు

సిద్దిపేట జిల్లా: నవంబర్ 18న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో లక్షల మందితో మాదిగల విశ్వరూప మహా సభ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో మాదిగల విశ్వరూప మహా సభలో మందకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటం కీలక దశకు చేరుకుందన్నారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆహ్వానిస్తున్నామని తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ జరిగినప్పుడే వారి పిల్లల చదువులు బాగుపడతాయని. చదువుకున్నవారికి ఉద్యోగాలు వస్తాయన్నారు. అన్ని పార్టీలలో ఉన్నటువంటి దళితులందరు హైదరాబాదులో జరిగే మహాసభకు పార్టీలకు అతీతంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు మాకు మద్దతు పలకాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఏ పార్టీ మద్దతు ఇస్తామని స్పష్టత ఇస్తే ఆ పార్టీకే తాము మద్దతు పలుకుతామని మందకృష్ణ మాదిగ వెల్లడించారు.

## నారాయణఖేడ్, పరిగిలో కర్ణాటక రైతుల నిరసన.. అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణ్‌ఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు అమలు కావడం లేదంటూ ప్రకార్డులతో నారాయణఖేడ్‌లో నిరసన చేపట్టారు. తెలంగాణ పౌరులు కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని కర్ణాటక రైతులు నినాదాలు చేశారు. నిరసన చేస్తున్న వారిని స్థానిక కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఫ్లకార్డులను చించివేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. అనంతరం పలువురు కర్ణాటక రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. తెలంగాణ వాసులు కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. మరోవైపు స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. "వీరు రైతులు కాదు. పెయిడ్ ఆర్టిస్టులు. తెలంగాణలో కాంగ్రెస్ హవా చూసి భారాస నాయకులు పెయిడ్ ఆర్టిస్టులతో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు" అని ఆరోపించారు.

**పరిగిలోనూ ఆందోళన..** వికారాబాద్ జిల్లా పరిగిలోనూ కర్ణాటకకు చెందిన పలువురు అన్నదాతుల నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు అమలు కావడం లేదంటూ ఆ పార్టీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. పరిగిలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రైతులు ర్యాలీ నిర్వహించారు. పరిగిలో రేవంత్ రెడ్డి రోడ్ షోకు ముందు కర్ణాటక రైతులు ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇది గమనించిన స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రైతుల నుంచి ప్లకార్డులు లాక్కున్నారు. దీంతో రైతులు, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం, ఉద్రిక్తత నెలకొంది.

# నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి...

ప్రచార సరళి, ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికపుడు నిశితంగా పరిశీలించాలి...
నోడల్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిశానిర్దేశం.





గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : రాష్ట్ర శాసనసభ ఎన్నికగరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి పనిని జాగ్రత్తగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎలాంటి జాప్యానికి తావు లేకుండా, వెనువెంటనే నివేదికలుతోపాటుగా, తగు చర్యలు తీసుకుంటూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తమతమ విధులు నిర్వహించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి జిల్లాలోని శిక్షణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ - ఎంసీసీ), జిల్లా గ్రీవెన్స్ కమిటీ, పోస్టల్ బ్యాలెట్, లా అండ్ ఆర్డర్, మీడియా మానిటరింగ్ (ఎంసీఎంసీ), స్వీప్ అంశాలపై సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అనుసారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు గాను ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన మేరకు నియోజకవర్గంలో ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేసామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, అక్రమ నగదు బంగారం, ఇతర ముఖ్యమైన ఆభరణాలు, ఉచితాల పంపిణీని అరికట్టేందుకు ఈ బృందాలు కట్టుదిట్టంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిపై చేయనున్నట్లు, ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు డీఏవీపీ, డీఐపిఆర్ రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ వివరాలను ఎంత వరకు వచ్చాయో నోడల్ అధికారి వంశీమోహన్ను అడిగి తెలుసుకొన్నారు. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, సదరు విషయంలో ముందస్తుగా వివరాలు అన్ని సేకరించాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై సంబందిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలోని ఎన్నికల కేంద్రాల్లో ఏమైనా పనులు చేపట్టాల్సిన అవసరం ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాము చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, తదితర అంశాలను సమావేశంలో వివరించారు. దానితో పాటుగా ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలే ప్రాణదాతలు...

అత్యధిక రక్తహీనతకు మూలం తలసేమియా వ్యాధి...
డియర్ వన్ నియర్ వన్ ఫౌండేషన్...



తలసేమియా వ్యాధి పట్ల అవగాహ కల్పిస్తూ, సదరు వ్యాధి నిర్మూలన కృషి చేస్తున్న స్వచ్చంద సంస్థ డియర్ వన్ నియర్ వన్ ఫౌండేషన్ పై హర్షం వ్యక్తం అవుతుంది. షామీర్పేట మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో డియర్ వన్ నియర్ వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సదరు నిర్వాహకులు మాట్లాడుతూ... మానవ శరీరంలో ప్రతి భాగానికి ఆక్సిజన్ అందించేది రక్తంలో ఉండే ఎర్ర రక్త కణాల్లోని హిమోగ్లోబిన్ మాత్రమేనని, అయితే ఎర్ర రక్త కణాలు తయారీలో, ఏదైనా లోపం జరిగి అవి సరిగ్గా ఏర్పడకపోతే వాటి ఆయుష్షు తగ్గిపోయి, త్వరగా ఎర్ర రక్త కణాలు చనిపోతాయి, తద్వారా శరీరంలోని రక్త శాతం తగ్గిపోయి రక్తహీనత ఏర్పడి మనిషి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారు అలాంటి ఒక సమస్య తలసేమియానని తెలిపారు. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) లెక్కల ప్రకారం ప్రపంచంలో నాలుగున్నర శాతం మంది చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. భారతదేశంలో మూడు కోట్ల యాభైలక్షల మందికి పైగా తలసేమియాతో బాధపడుతున్నారన్నారు. ఆరోగ్యంగా వున్న యువతీ యువకులు స్వచ్ఛందగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వారు పిలుపునిచ్చా. ఈ రక్తదాన శిబిరంలో యువతి యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసారు. తలసేమియా వ్యాధి చిన్నారుల ప్రాణాలు కాపాడేందుకు రక్తదానంతో తాము సైతం సహాయపడుతున్నందున తమకు గర్వంగా ఉందని రక్తదాతలు అభిప్రాయపడ్డారు

# నిరంకుశ పాలనకు చర్మ గీతం పాడేందుకు కృషి చేసిన వీర యోధుడు కొమరం భీమ్...

కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఖాన్...

షామీర్పేట్: తెలంగాణ విముక్తి కోసం ఆసఫ్ జాహీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర యోధుడు కొమరం భీమ్ అని కెసిఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి, బిఆర్ ఎస్ జిల్లా నాయకుడు మహమ్మద్ ఖాన్ గుర్తు చేశారు. శనివారం కొమరం భీమ్ వర్థంతిని పురస్కరించు కొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అఫ్జల్ ఖాన్ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ... పేద ప్రజల భూమి బుక్తి కోసం పోరాటం చేసిన యోధుడు కొమరం భీమ్ అన్నారు. వీర యోధుడు చేసిన పోరాటం ఎన్నో నిరంకుశ భూ పోరాటాలకు నాంది పలికిందన్నారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటుగా ఉపాధ్యాయులు, బి ఆర్ ఎస్ నాయకులు పట్నం నరసింహ రెడ్డి, మొహమ్మద్ ని సార్, చాణిక్య, కౌశిక్, విశాల్, భారత్ పాల్గొన్నారు




Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com